పిఎన్‌డిటి చట్టంపై అవగాహన కలిగి ఉండాలి

విశాలాంధ్ర-పులివెందుల: ప్రతి విద్యార్థి పిసిఅండ్ పిఎన్‌డిటి చట్టం గురించి అవగాహన కలిగి ఉండాలని డిప్యూటీ డిఇఓ రమణ మ్మ అన్నారు. సింహాద్రిపురం మండలం కొవరం గుట్టపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బలపనూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం గర్భస్థపూర్వ, పిండ లింగ నిర్ధారణ వ్యతిరేక చట్టం గురించి ఏర్పాటు చేసిన సమావేశంలో రమణమ్మ మాట్లాడుతూ స్కాన్ సెంటరుకు వెళ్లినప్పుడు అక్కడ వారిని ఆడమగ లింగా నిర్ధారణ గురించి అడిగిన యెడల చెప్పిన ఆసుపత్రి యాజమాన్యం మీద అలాగే చెప్పించుకున్న వారిపైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటారన్నారు. ఆడమగ పుట్టుకకు కారణం మగవారేనన్న విషయం తెలుకోవాలన్నారు. హెల్త్‌ఎడ్యుకేటర్ ఓబులేసు మాట్లాడుతూ బేటి బచావో బేటి డావో అను కార్యక్రమం ఆడపిల్లలను రక్షించడానికి, చదివించడానికి ఏర్పాటు చేశారన్నారు. ప్రతి ఒక్కరూ ఆడపిల్లలను గౌరవించాలని ఓబులేసు కోరారు. సీహెచ్‌ఓ శివతేజేశ్వరి యోగా గురించి అవగాహన కల్పిస్తూ వారితో అభ్యసనా కార్యక్రమాలు చేయించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ప్రభుదాసు, టీచర్ గోపాల్‌రెడ్డి, ఏఎన్ఎమ్ లక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

యువతకు ద్రోహం చేస్తున్న ప్రభుత్వాలు : తులసిరెడ్డి

విశాలాంధ్ర- వేంపల్లె: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండు కలిసి నిరుద్యోగ యువతను మోసం చేస్తున్నాయ ని పీసీసీ మీడియా చైర్మన్ తులసిరెడ్డి విమర్శించారు. వేంపల్లెలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడు తూ దేశవ్యాప్తంగా సుమారు 10లక్షల కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయన్నారు. వీటి భర్తీ చేయాల్సి ఉండగా ప్రభుత్వాలు మాత్రం నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరించడం దుర్మార్గమన్నారు. అలాగే సీఎం జగన్ కూడా రాష్ట్రంలో నిరుద్యోగ యువతను మోసం చేస్తున్నా రని దుయ్యబట్టారు. జగన్ ప్రభుత్వం పారిశ్రామిక వ్యతిరేక చర్యలకు పాల్పడుతోందన్నారు. దీని వల్ల ప్రైవేటు రంగంలో ఉద్యోగాలు రావడం లేదన్నారు. నిధులు లేని కారణంగా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ తదితర కార్పో రేషన్లు స్వయం ఉపాధి పథకాలు అమలు చేయలేదని ఆరోపించారు. అటు రాష్ట్రంలో ఇటు దేశంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలు వెంటనే భర్తీ చేయాలని కాంగ్రెస్ తరుపున డిమాండ్ చేస్తున్నట్లు తులసిరెడ్డి వెల్లడించారు.

ప్రొద్దుటూరులో దారుణ హత్య

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు మండలం కొత్తపల్లె గ్రామ పంచాయతీలోని కానపల్లె గ్రామంలోని ఎస్సీ కాలనీలో శుక్రవారం తెల్లవారుజా మున అక్కుపల్లి నాగేం ద్రబాబు(30) అనే వ్యక్తిని గుర్తు తెలియని వ్యక్తులు గొంతుకోసి హత్య చేశారు. రాత్రి ఇంటిపై నిద్రిస్తున్న నాగేంద్ర బాబు ఉదయం కిందికి రాకపోవడంతో భార్య ఇమాంబి పైకి వెళ్లి చూడగా భర్త రక్తపు మడుగులో పడి ఉండటాన్ని చూసి స్థానికులకు, పోలీసులకు ఫిర్యాదు చేసింది. మృతుడు గ్రానైట్ పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తుండేవాడు. హత్యకు గురైన నాగేంద్ర ది ప్రేమ వివాహం, కాగా వీరికి ఒక పాప నందన, బాబు నందన్‌లు ఉన్నారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు హత్యకు గల కార ణాలపై విచారిస్తున్నారు. హత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడిగా రాజానాయక్

విశాలాంధ్ర-వేంపల్లె: టీడీపీ ఎస్టీ సెల్ పార్లమెంటు ఉపాధ్య క్షుడిగా మండలంలోని బక్కన్న గారిపల్లెకు చెందిన మూడే రాజానాయక్ ఎంపికయ్యారు. ఆ మేరకు ఆయన ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్ర బాబును కలుసుకుని నియామకం పత్రం పొందారు. ఈ సందర్బంగా రాజానాయక్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన పదవికి న్యాయం చేస్తానన్నారు. టీడీపీ కేడర్ మరింత పటిష్టపరచేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. తనకు పదవి వచ్చేందుకు సహకరించిన చంద్ర బాబు, ఎస్సీ రాష్ట్ర అధ్యక్షుడు శివేరి దున్నదొర, దారునాయక్, జిల్లా అధ్యక్షుడు లింగారెడ్డి, బీటెక్ రవిలకు అభినందనలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

విశాలాంధ్ర-యర్రగుంట్ల : ఎర్రగుంట్ల అర్బన్, రూరల్ ప్రాంతాలతో పాటు కమలాపురం, వీరపునాయునిపల్లె మండలాల పరిధిలో శనివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నరసింహారెడ్డి తెలిపారు. ఈ సమయంలో ఆయా సబ్‌స్టేషన్లలో మరమ్మత్తు పనులు, విద్యుత్ తీగల మధ్య ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు, వేలాడుతున్న తీగలను సరిచేయడం వంటి పనులు చేపడుతామని ఆయన వివరించారు. విద్యుత్ సరఫరాలో కలుగు అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపికైన ఎ.ఆర్తి



విశాలాంధ్ర-ఒంటిమిట్ట : ఒంటిమిట్ట మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి ఎ.ఆర్తి ట్రిపుల్ ఐటీకి ఎంపిక అయ్యారని కొత్త మాధవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగలక్ష్మి అన్నారు. ఆమె పాఠశాలలో శుక్రవారం మాట్లాడుతూ మల్లేశ్వర పురం కు చెందిన గద్దె శివలింగం, సుశీల రెండవ బిడ్డ ఆర్తి అన్నారు. తమ తల్లిదండ్రులు పేదరికంలో ఉంటూ, చిన్న దుకాణమును నడుపుకుంటూ తమకు ముగ్గురూ ఆడబిడ్డలే ఉన్నప్పటి కీని వారే అండగా భావించి ముగ్గురిని చదివింపసాగారన్నారు. రెండవ అమ్మాయి ఆర్తి 2022- 23 వ విద్యా సంవత్సరంలో జరిగిన పదవ తరగతి పరీక్షలలో 568 మార్కులు సాధించారన్నారు. ఉన్నతమైన మార్కులను సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలుచుటయే కాక త్రిబుల్ ఐటీ లో స్థానం దక్కించుకున్నారు. ఆర్తి పాఠశాలలో జరుగు చున్న అన్ని కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనేదని అన్నారు. తమ పాఠశాలకు చెందిన విద్యార్థి ట్రిపుల్ ఐటీలో సీటు సాధించడం తమకు ఎంతో గర్వకారణంగా ఉందని ఆమె అన్నారు. ఆర్తి ట్రిపుల్ ఐటీలో సీటు సాధించడం తమ పాఠశాలకే కాక, తమ తల్లిదండ్రులకు, గ్రామానికి గర్వకారణమన్నారు. మంచి మార్కులు సాధించేందుకు ఆర్తికి విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు.

సీటుబెల్టు, హెల్మెట్ తప్పనిసరి : సీఐ

విశాలాంధ్ర-ఒంటిమిట్ట : నాలుగు వాహనాల చోదకులు సీటు బెల్టు తప్పనిసరి, టూ వీలర్ చోదకునికి హెల్మెట్ తప్పనిసరిగా ఉండాలని ఒంటిమిట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పురుషోత్తమరాజు అన్నారు. శుక్రవారం మండలకేంద్రమైన ఒంటిమిట్టలో మలకాట్‌పల్లె క్రాస్ వద్ద కడప-చెన్నై ప్రధాన రహదారిలో సీటుబెల్టు లేని వారికి రికార్డు, హెల్మెట్లు లేని వారికి అపరాధరుసుం వేశారు. దాదాపు 25 వాహనాలకు రుసుం వేసినట్లు సీఐ తెలిపారు. ముఖ్యంగా వాహనచోదకులు తప్పనిసరిగా సీటుబెల్టు, హెల్మెట్ తప్పక పెట్టుకోవాలన్నారు. హెడ్‌కానిస్టేబుల్ హర్ష, కానిస్టేబుళ్లు రవిరెడ్డి, సుబ్బరాయుడు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రాలని చినుకు - పట్టని కునుకు

అదునుదాటున్నా కన్పించని వరుణుడి జాడ- అయోమయంలో అన్నదాతలు

విశాలాంధ్ర-పులివెందుల: ఖరీఫ్ సీజన్ రానే వచ్చింది. ఇంత వరకు వరుణిడి జాడ కన్పించకపోవడంతో అన్నదాతలు అయోమయానికి గురవుతున్నారు. చినుకు రాలకపోవడం రైతుల కంటిమీద కునుకు పట్టలేదు. ఎంతో ఆశగా ఎదురుసూచిన రుతుపవనాలు చివరకు ఉసురుమనిపించాయి. సేద్యాల వరకు కురిసిన పదును వానలు విత్తు సమయం వచ్చే సరికి అవి మటుమాయయ్యాయి. ఇప్పటికే ఖరీఫ్‌లో సగభాగం గడిచిపోయింది. సాధారణగా జూన్ నుంచి జూలై వరకు విత్తనం వేసుకునేందుకు రైతులకు అనుకూలంగా ఉంటుంది. ఈ విషయానికి వస్తే ఇప్పటికి నెలన్నర కాలం పూర్తయింది. ఇక పక్షంరోజులు మాత్రమే మిగిలాయి. ప్రస్తుత వాతావరణం చూస్తే నెలాఖరుకు వర్షాలు వస్తాయన్న నమ్మకం రైతుల్లో లేదు. ఈ దఫా సకాలంలో నైరుతీ రుతుపవనాలు ప్రవేశించి మంచి వర్షాలు వస్తాయని నమ్ముకున్న రైతులకు నిరాశ ఎదురవుతోంది. ప్రభుత్వం కూడా రైతు సంక్షేమం కోసం నెలక్రితమే రాయితీపై విత్తనకాయలను పంపిణీ చేసింది. అలాగే సరిపడు ఎరువులను కూడా ఆర్‌బికెలో అందుబాటులో ఉంచింది. కానీ అన్నీ ఉన్నా అల్లుడినోట్లో శని అన్న చందంగా తయారైంది. కాగా ఏటా ఖరీఫ్‌లో ప్రధాన పంటగా వేసే వేరుశగన విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోతోంది. పులివెందుల నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు లక్షా ఎకరాలకు పైబడి వేరుశనగ సాగుచేసే వారు. ప్రస్తుత నేపథ్యంలో ఇందులో 25శాతం కూడా రైతులు వేరుశనగ సాగించనట్లు తెలుస్తోంది. ఇందుకు అనేక కారణాలు రైతులు వెల్లడిస్తున్నారు. ముఖ్యంగా వేరుశనగ సాగుకు విపరీతమైన ఖర్చు కలిసిరావడం, పైరు మధ్యలో వర్షాభావ పరిస్థితులు తోడవడం, దిగుబడి చేతికందాక గిట్టుబాటు ధర లభించకోవడం లేదా దిగుబడి దశలో వైరస్ వెంటాడటం వంటి కారణాల వల్ల రైతులు వేరుశనగ సాగు పట్ల మొగ్గుచూపలేదని తెలుస్తోంది. ఇందుకు ప్రత్యామ్నాయంగా పత్తిపంటను రైతులు సాగిస్తున్నారు. ఇక 25శాతం వేరుశనగ సాగించాలన్నా అందుకు ప్రకృతి సహకరించలేదు. రెండు వారాలుగా ఆకాశం మేఘావృతమవుతోంది. కానీ మేఘాలు మాత్రం కర్పూరంగా కరిగిపోతున్నాయి. దీంతో రైతు జీవనం దయనీయంగా మారింది. సాగులో ఉన్న పంటలకు వైరస్ కూడా వెంటాడుతోందని రైతులు చెబుతున్నారు. పత్తిపంటకు ఎర్రనక్కలు తెగులు సోకిందని రైతులు వెల్లడించారు. ఏది ఏమైనా ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ విత్తుకు పక్షం రోజుల సమయం ఉంది. నెలాఖరులోపు మంచి వర్షాలు కురవాలని, అన్నదాతలు అన్ని విధాలా గట్టెక్కాలని ఆశిద్దాం.

ప్రయోజనకారిగా 'సురక్ష'

విధిగా ఎమ్మెల్యే హాజరు- 6251 ధృవపత్రాలు పంపిణీ

విశాలాంధ్ర- యర్రగుంట్ల : రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 1వ తేదీ నుండి కొనసాగిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా పలువురికి ప్రయోజనం చేకూరుతోంది. 11 రకాల ధృవీకరణ పత్రాలను ఎలాంటి రుసుం లేకుండా అందించేందుకు ఉద్దేశించిన ఈ కార్యక్రమం సర్వత్రా కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఎర్రగుంట్ల నగర పంచాయతీ పరిధిలో 9 వార్డు సచివాలయాలు ఉండగా ఇప్పటి వరకు 7 సచివాలయాల పరిధిలో ఈ కార్యక్రమం పూర్తయింది. మొత్తంగా ఆయా సచివాలయాల పరిధిలో 3410 ధృవీకరణ పత్రాలను దరఖాస్తుదారులకు అందజేయడం గమనార్హం. అత్యధికంగా 5వ సచివాలయం పరిధిలో 620, 6వ సచివాల యం పరిధిలో 620 ధృవీకరణ పత్రాలు జారీ కావడం విశేషం. అలాగే రూరల్ పరిధిలో 14 గ్రామ సచివాలయాలు ఉండగా ఇప్పటి వరకు 9 సచివాలయాల పరిధిలో సురక్ష కార్యక్రమం జరిగింది. ఇందుకు సంబంధిం చి 2841 మందికి ధృవీకరణ పత్రాలు అందజేశారు. ఆయా ప్రాంతాల్లో జరిగిన సురక్ష కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి, ఎర్రగుంట్ల మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి, జడ్పీటీసీ సభ్యులు తమ్మిశెట్టి బాలయ్యతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని వీటిని అందజేశారు. ఎర్రగుంట్ల అర్బన్, రూరల్ ప్రాంతాల్లో సురక్ష కార్యక్రమం ఓ యజ్ఞంలా నిర్విఘ్నంగా కొనసాగుతోందని చెప్పవచ్చు. ప్రతి చోట ఎమ్మెల్యే విధిగా హాజరవుతూ ప్రజలకు భరోసా కల్పిస్తున్నారు.

నీతికి, నిజాయితీకి నిలువెత్తు రూపం ఉన్నం మోహన్‌రావు

విశాలాంధ్ర-ఒంటిమిట్ట : ఒంటిమిట్ట మండల పరిషత్ మాజీ ఉప మండలా ధ్యక్షుడు ఉన్నం మోహన్‌రావు నీతికి, నిజాయితీకి, ధైర్యానికి నిలువెత్తు నిదర్శనమని ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య అన్నారు. శుక్రవారం ఉదయం సి.రామచంద్రయ్య వారి కుటుంబాన్ని సందర్శించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపి మోహన్‌రావు నాకు నలభై ఏళ్లుగా పరిచయం ఉందని ఒకే పార్టీలో ఉంటూ ఎంత మంది చెప్పినా పార్టీ మారకుండా నీతి నిజాయితీతో వ్యవహరించిన వ్యక్తి మోహన్‌రావు అని ఈ సమయంలో ఆయన మన మధ్య లేకపోవడం బాధాకరమన్నారు. మోహన్‌రావు తన చిన్నతనం నుంచి రాజకీ యాల్లో చురుగ్గా పాల్గొనేవారని ఇప్పుడు ఆ రాజకీయ వారసత్వాన్ని వారి కుమారుడైన ఉన్నం కిరణ్‌కుమార్ తండ్రిలా రాజకీయ వారసత్వం కొనసాగించడం చురుగ్గా రాజకీయాల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని ఎమ్మెల్సీ రామచంద్రయ్య అన్నారు. ఈకార్యక్రమంలో ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ ఎద్దుల సుబ్బరాయుడు, నందలూరు మాజీ మండల పరిషత్ అధ్యక్షుడు పల్లె సుబ్రమణ్యం, గంటా వాసుదేవయ్య, చక్రాల రామసుబ్బయ్య, నందలూరు టీడీపీ అధ్యక్షుడు జంగంశెట్టి సుబ్బయ్య, మోహన్‌రావు అల్లుడు అడ్వకేట్ ఆదినారాయణ, ఎమ్మెల్సీ రామచంద్రయ్య బంధువు ఈశ్వరయ్య, మిత్రుడు రమణారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇటుకల బట్టీలను పక్కకు మార్చరా

ఎన్నిసార్లు చెప్పినా ఇంతేనా- కార్యదర్శిని ప్రశ్నించిన వార్డు సభ్యులు

విశాలాంధ్ర - చెన్నూరు : మేజర్ గ్రామపంచాయతీ చెన్నూరుకు వచ్చే రోడ్డుకి ఇరువైపులా ఇష్టానుసారంగా వెలసిన ఇటుకలబట్టీల తో రోజు ఆ దారిన తిరిగే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇటుకల బట్టీలను మార్చరా ఎన్నిసార్లు సమావేశాల్లో చెప్పిన పరిస్థితి ఇంతేనా అంటూ వార్డు సభ్యులు కల్లూరు ఓబుల్ రెడ్డి, టీఎన్ మహేశ్వర్ రెడ్డిలు కార్యదర్శి రామ సుబ్బారెడ్డిని ప్రశ్నించారు. చెన్నూరు గ్రామపంచాయతీ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ వెంకటసుబ్బయ్య (కళ్యాణ్) ఆధ్వర్యంలో జరిగింది. వార్డు సభ్యులు మాట్లాడుతూ ఇష్టానుసారంగా వెలసిన ఇటుకల బట్టీలపై చర్యలు తీసుకోకపోవడంతో పట్ల అసంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రజలు చాలా మార్లు తమకు ఫిర్యాదు చేశారని మిమ్మల్ని గెలిపించినందుకు ఇబ్బందికరంగా ఉన్న ఇటుకల బట్టీలను తొలగించి ప్రజలకు మేలు చేయలేరా అని పదేపదే అడుగుతున్నారని కార్యదర్శి పై వార్డు సభ్యులు మండిపడ్డారు. ఎన్నో ఏళ్లుగా రోడ్డుకి ఇరువైపు లా ఆనుకునే ఇటుకల బట్టీలు ఉన్నాయని బట్టీల వల్ల దుమ్ము, పొగ వచ్చి ఇబ్బందులు గురి చేస్తున్నాయని, అనారోగ్యానికి కూడా గురవుతున్నారని, ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. పైగా చెన్నూరు క్రాసింగ్ నుండి పోలీస్ స్టేషన్ వరకు వీధిలైట్లు లేవని రాత్రి వెళ్లాలంటే ఆ దారి అంతా ఎక్కువ చీకటిగా ఉన్నందున ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని లైట్లు వేయాలని కోరారు. అలాగే 2020 సంవత్సరం నుండి ఇప్పటివరకు గ్రామపంచాయతీకి 14 ,15 వ ఆర్థిక సంఘం నిధులు గృహాల ద్వారా వచ్చిన పన్నులు, వేలం పాటల ద్వారా పంచాయతీకి ఎంత ఆదాయం వచ్చింది, ఎంత ఖర్చు చేశారు, జీతాలకు ఎంత పెడుతున్నారు, ఎంత నిల్వ ఉంది అన్న సమాచారాన్ని ఇవ్వాలని వార్డు సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు రాజేష్, గౌస్ పీర్ పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం : డిప్యూటీ సీఎం

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : మనిషి ఆరోగ్యంగా జీవించాలంటే మంచి నీరు కూడా అవసరమని మనం తాగే నీరు కలుషితం లేకుండా శుద్ధంగా ఉండే మంచి నీరు తాగడం వల్ల ఆరోగ్య వంతులుగా ఉంటారని అన్నారు. శుక్రవారం నగరంలోని మట్టి పెద్దపులి వద్ద అల్ సఫా ప్యూర్ ఫ్రైడ్ డ్రింకింగ్ వాటర్ ప్లాంటును వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చుట్టుపక్కల నివసించే వారికి మంచి ప్యూర్ ఫ్రైడ్ నీరు అందించి మంచి పేరు తెచ్చుకొని వ్యాపారం దినదినాభివృద్ధి చెందేలా డుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వాటర్ ప్లాంట్ ప్రొప్రైటర్ షేక్ అక్బర్ బాషా, వైసీపీ నాయకులు గౌస్ బాషా చాక్లెట్, అలీ అక్బర్, పవర్ అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

కువైట్ ప్రవాసాంధ్ర రెడ్డీస్ సంఘం సామాజిక సేవలు అభినందనీయం: జడ్పీ చైర్మన్

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : కువైట్ ప్రవాసాంధ్ర రెడ్డీస్ సంఘం అధ్యక్షులు నాయిని మహేష్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం రైల్వే కోడూరు కు చెందిన యువకులు కువైట్ కు వెళ్లి కుల మతాలకు అతీతంగా పేదలకు తమ వంతు సహాయం చేస్తామనే ఆలోచనతో 2009 సం:లో మహానేత దివంగత ముఖ్యమంత్రి వై.యస్. రాజశేఖర్ రెడ్డి స్ఫూర్తితో వారి జయంతి రోజున కువైట్ ప్రవాసాంధ్ర రెడ్డీస్ అసోసియేషన్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ అసోసియేషన్ ముఖ్య ఉద్దేశం కువైట్ లో ఉన్న రెడ్డి సోదరులు సభ్యుడిగా చేరితే సభ్యులు ఏదైనా సమస్య వచ్చినప్పుడు సభ్యుడికి 50 వేలు ఆర్థిక సహాయం అందిస్తుంది. దురదృష్టం కొద్దీ మరణిస్తే వారి కుటుంబానికి లక్ష రూపాయలు ఆర్థిక సహాయం అందిస్తుంది. కమిటీలో సభ్యులు కాక పోయిన ఏదైనా సమస్య ఉంటే వారి దృష్టికి వస్తే కుల మతాలకు అతీతంగా ఆర్థిక సహాయం చేస్తుంది. ఈ సందర్భంగా జడ్పీ చైర్మన్ రాజంపేట మాజీ శాసనసభ్యులు ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి మాట్లాడుతూ ప్రవాసాంధ్ర రెడ్డీస్ సంఘం సేవలు అభినందనీయమని తమ కుటుంబ సభ్యుల ఉజ్వల భవిష్యత్తు కొరకు కువైట్ వెళ్లిన రెడ్డీస్ సామజిక వర్గానికి చెందిన యువకులు కుల మతాలకు అతీతంగా సామాజిక సేవ చేయాలనే మంచి ఉద్దేశంతో సంఘం ఏర్పాటు చేయడం ప్రశంసనీయమని, కువైట్ సంఘంలో సభ్యుడిగా ఉన్న బద్వేల్ మండలం రాజుపాలెం గ్రామనికి చెందిన కల్లూరు శివరామిరెడ్డి ప్రమాదంలో కాలు విరగడం చికిత్స కొరకు స్వస్థలానికి వచ్చిన విషయం తెలుసుకొని అతని చికిత్స కొరకు తమ వంతు సహాయంగా సంఘం తరపున 50 వేల రూపాయలు ఆర్థిక సహాయం చేయడం హర్షణీయమన్నారు. సంఘం సభ్యులకు అభినందిస్తూ అన్నమయ్య జిల్లా ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. శివరామిరెడ్డి మాట్లాడుతూ ప్రమాదం జరిగి కష్టాలో ఉన్న నాకు జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్ నాథ్ రెడ్డి చేతుల మీదుగా 50 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించినందుకు సంఘం సభ్యులకు కృతజ్ఞతాభివందనాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్డీస్ సంఘం గౌరవ అధ్యక్షుడు ముమ్మడి వెంకటసుబ్బారెడ్డి, ప్రధాన సలహాదారులు మూలపల్లి రమణారెడ్డి, సలహాదారుడు పోలి గంగిరెడ్డి సభ్యులు సుమన్ రెడ్డి, హనుమంతరెడ్డి వెంకటరెడ్డి, గల్ఫ్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ ఇలియాస్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ముంగిట్లో నవరత్నాల పంట

పేదల ముఖంలో చిరునవ్వు జగన్మోహన్ రెడ్డికే సాధ్యం: చిగురుపాటి నాగమణి, చిగురుపాటి త్యాగరాజు

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : ప్రతి పేదవాడి ఇంటి ముందు నవరత్నాల పంట పండిందని ప్రతి పేదవాడు చిరునవ్వుతో ఆనందంగా ఉన్నాడని 26వ డివిజన్ కార్పొరేటర్ చిగురుపాటి నాగమణి, డివిజన్ ఇంచార్జ్ చిగురుపాటి త్యాగరాజ్‌లు అన్నారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి పేదవాడి ఇంటి తలుపు తట్టి సంక్షేమాలు అందిస్తున్న ప్రభుత్వం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వమే అని అన్నారు. అలాగే మా డివిజన్‌ను ఎంపీ అవినాష్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి అంజాద్‌భాష, మేయర్ సురేష్ బాబుల సహకారంతో అన్ని విధాల అభివృద్ధి చేశామని తెలిపారు. మా డివిజన్‌లో సుమారు ఒక కోటి 50 లక్షల రూపాయల వరకు సీసీ రోడ్లు డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి పనులు చేశామని అన్ని పథకాల ద్వారా నాలుగు కోట్ల 30 లక్షల 46000 రూపాయలు సంక్షేమాల ద్వారా ప్రజలకు అందించామన్నారు. మా డివిజన్లో పింఛన్ ద్వారా 186 మంది పింఛన్‌దారులు ఉన్నారని వారికి ఇప్పటివరకు 1 కోటి 30 లక్షల 68 వేల రూపాయలు అందించామన్నారు. వైయస్సా ర్ వాహన మిత్ర ద్వారా 10 మందికి 2లక్షల రూపాయలు అందజేశామన్నారు. వైయస్సార్ చేయూత కింద 108 మందికి నాలుగు లక్షల 50 వేల రూపాయలు అందించామన్నారు. వైయస్సార్ ఆసరా కింద 590 మందికి 93 లక్షల 86 వేల 550 రూపాయలు అందించడం జరిగిందన్నారు.

వైయ స్సార్ సున్నా వడ్డీ కింద 560 మందికి 9 లక్షల 67 వేల 492 రూపా యలు అం దించామ న్నారు. జగనన్న తోడు కింద 119 మందికి 23 లక్షల 80 వేల రూపాయలు అందించామన్నారు. జగనన్న చేదోడు 10 మందికి 2లక్షలు రూపాయలు అందించామన్నారు. జగనన్న విద్యాదీవెన కింద 182 మందికి 21 లక్ష 84 వేల రూపాయలు అందించామన్నారు. జగనన్న అమ్మఒడి కింద 368 మందికి 1 కోటి నాలుగు లక్షల 10 వేల రూపాయలు అందించడం జరిగిందన్నారు. మా డివిజన్లో వైయస్సార్ బీమా కింద ఇద్దరికీ రెండు లక్షల రూపాయలు అందించామన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతి పేదవాడు సొంత ఇంటి కల నెరవేరేందుకు జగనన్న ఇల్లు ఇస్తున్నారని అందులో భాగంగా మా డివిజన్ కు 534 మందిని గుర్తించి వారికి ఇంటి పట్టాలు అందించామన్నారు. రాబోయే రోజుల్లో మా డివిజన్లో అన్ని విధాల అభివృద్ధి చేస్తామని తెలిపారు.

అవినీతి రహిత ప్రభుత్వం జగన్ ప్రభుత్వం

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : గత ప్రభుత్వంలో ఏ పథకం రావాలన్నా లం చాలు ఇస్తే కానీ పథకాలు వచ్చే పరిస్థితిలో ఉండేది కాదని మన ప్రభుత్వంలో అవినీతికి తావు లేకుండా ప్రజల వద్దకే పాలన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తెస్తున్నారని ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా వైసిపి సీనియర్ నాయకులు అఫ్జల్ ఖాన్ 37వ డివిజన్ కార్పొరేటర్ సమ్మెట వాణి ఇంచార్జ్ సమ్మెట బసవరాజులు అన్నారు. ఈ మేరకు శనివారం 37వ డివిజన్లో ఏర్పాటుచేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో వారు మాట్లాడుతూ గతంలో సర్టిఫికెట్లు కావాలంటే ఎమ్మార్వో ఆఫీసుల చుట్టూ కార్పొరేషన్ ఆఫీసుల చుట్టూ తిరిగే వారిని సంక్షేమ పథకాలు అందాలంటే ముడుపులు ఇస్తే కానీ సంక్షేమాలు అందని పరిస్థితి ఉండేదని అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో అధికారంలోకి వస్తూనే ప్రజల వద్దకు పరిపాలన ఉండాలని విధంగా వాలంటీర్ వ్యవస్థ తీసుకొచ్చి ప్రజలకు ప్రతి సంక్షేమ పథకాన్ని ఇంటి వద్దకు తీసుకు వచ్చే విధంగా పరిపాలన కొనసాగిస్తున్నార న్నారు. వాలంటరీ వ్యవస్థలో కానీ సచివాలయ వ్యవస్థలో కానీ ఎక్కడైనా ఒక్క రూపాయి తీసుకున్నట్లయితే అలా తీసుకున్న వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రజలకు సేవ చేసేందుకే ఈ వ్యవస్థను తీసుకు రావడం జరిగిందన్నారు అంతే కాకుండా అభివృద్ధి పరిపాలన సమ యపాలనలో ప్రభుత్వాలు నడుస్తున్నాయని కొనియాడా రు. వచ్చే ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డిని ఆశీర్వదించాలని మళ్లీ అధికారంలోకి వస్తే మరిన్ని సంక్షేమాలు ప్రజల ముంగిటకు వస్తాయని తెలిపారు. అనంతరం లబ్దిదారుల కు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు సుబ్బారెడ్డి, కార్పొరేటర్ షఫీ,నాయకులు మియ్య,పవర్ అల్తాఫ్,తోట కృష్ణ, స్థానిక డివిజన్ నాయకులు నూర్ భాషా అమీద్ మియా ఫామ్ శీను పాల్గొన్నారు.

ప్రశాంతనగర్‌లో జగనన్న సురక్ష

విశాలాంధ్ర-పులివెందుల: పట్టణ పరిధిలోని ప్రశాంతనగర్‌లో శుక్రవారం జగనన్న సురక్ష కార్య క్రమం నిర్వహించారు. కార్యక్రమా నికి ముఖ్య అతిథిలుగా విచ్చే సిన వైసీపీ మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ వరప్రసాద్‌లు మాట్లాడు తూ దేశంలో ఏ ముఖ్య మంత్రి చేపట్టని సంక్షేమ పథకాలు సీఎం జగన్ అమలు చేశార న్నారు. పులివెందుల పట్టణ అభివృద్ధికి ప్రత్యేకించి రూ.1700 కోట్లు నిధులు మంజూరు చేశారన్నారు. 2023 సంవత్సరంలో పులివెందులకు బెస్ట్ అవార్డు వచ్చేలా ప్రజలు సహకరించాలని వారు విజ్ఞప్తిచేశారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా 11రకాల ఉచిత సేవలను అందిస్తోం దని, వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మెప్మా పీడీ సురేష్‌రెడ్డి, మున్సిపల్ కమిషనరు నరసింహారెడ్డి, కౌన్సిలర్ కమలమ్మ, కో ఆప్షన్‌మెంబరు దాసరి చంద్రమౌళి, నోడల్ అధికారి గంగులయ్యా, పాల్గొన్నారు.

26వ వార్డు పరిధిలో: పట్టణ పరిదిలోని 26వ వార్డు పరిధిలో శుక్రవారం కౌన్సిలర్ లక్ష్మిప్రసన్నదేవి ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలన్నదే సీఎం జగన్ ధ్యేయమ న్నారు. అర్హత ఉండి ఎవరైనా ఉంటే వారిని గుర్తించి అర్హత ఆధారంగా సంక్షేమ పథకా లను అందిస్తామన్నారు. అలాగే ఈ కార్యక్రమంలో ద్వారా 11 రకాల ఉచిత సేవలు అందిస్తుందని, వార్డు ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో అడ్మిన్ సెక్రటరీ సురేష్‌నాయక్, వైసీపీ నాయకులు వీరారెడ్డి, పద్మనాభరెడ్డి, వాలంటీరు విజయ్, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు వరాల జల్లు

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : విజయవాడలో జరిగిన మహిళా శక్తిలో మాజీ ముఖ్యమంత్రి తెలుగుదేశం పార్టీ నాయకులు నారా చంద్రబాబు నాయుడు మహిళలకు వరాల జల్లు కురిపించాలని తెలుగుదేశం పార్టీ కడప నగర మహిళా అధ్యక్షురాలు మీనాక్షి, మాజీ కౌన్సిలర్ స్వర్ణలతాలు అన్నారు. శుక్రవారం వారు మీడియాతో మాట్లాడు తూ వైసీపీ నాయకులు అధికారంలోకి రాకముందు ప్రతి కుటుంబంలో ఎంతమంది చదువుకునే పిల్లలు ఉంటే అంతమందికి అమ్మఒడి వర్తిస్తుందని చెప్పి అధికారంలోకి వచ్చాక కుటుంబంలో ఒకరికి మాత్రమే పరిమితం చేశారని మా నాయకుడు చంద్రబాబు నాయుడు ప్రతి కుటుంబంలో 18 సంవత్సరాల నుండి 59 సంవత్సరాల వరకు ఉన్న మహిళలకు వారి అకౌంట్లో ప్రతినెల 1500 రూపాయలు వేస్తారని తెలిపారు. అలాగే అమ్మ ఒడి తరహాలో కుటుంబంలో ఎంతమంది చిన్నారులు చదువుకునే వారుంటే వారికి వారి తల్లుల అకౌంట్లో సంవత్సరానికి ఒక్కొక్కరికి 15వేల రూపాయలు చొప్పున అకౌంట్లలో వేస్తారని తెలిపారు. మహిళా శక్తిలో చంద్రబాబు నాయుడు మహిళలపై వరాల జల్లు కురిపిస్తుంటే మహిళలు ఆనంద కేకలు వేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మహిళా నాయకురాలు నిర్మల, మలంబి, శ్రీదేవి, మహేశ్వరి, ఉమా గిరిజ పాల్గొన్నారు.

అర్హులైన ప్రజలందరికీ సంక్షేమ పథకాలు



విశాలాంధ్ర - వల్లూరు : అర్హులైన ప్రజలం దరికీ సంక్షేమ పథకాలు అం దించడమే వైసీపీ ముఖ్య ఉద్దేశమని కమలాపురం నియోజవర్గం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని పైడి కాలువ పంచా యతిలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్షలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలకతీతంగా అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు సేవలందించడమే జగనన్న సురక్ష లక్ష్యమన్నారు. అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిం చాలని తెలిపారు. జగనన్న సురక్షలో భాగంగా విద్యార్థులు వారి తల్లిదండ్రులు కుల, ఆదాయ,జనన ధ్రువీకరణ పత్రాలు దరఖాస్తు చేసుకొని ఉచితంగా పొందవచ్చు అన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శంకర్రావు, ఎంపీడీవో జుబేదా, జెడ్పీటిసి వెంకటసుబ్బయ్య, మాజీ జెడ్పీటిసి అబ్బిరెడ్డి వీరారెడ్డి, సుబ్బారెడ్డి, మండల అధికారు లు సర్పంచులు, ఎంపీటీసీలు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర

వైఎస్ఆర్ కడప జిల్లా



ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: ఎంపీ అవినాష్‌రెడ్డి

విశాలాంధ్ర-పులివెందుల: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కనంపల్లె గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందన్నారు. వార్డు, సచివాలయ వ్యవస్థ ద్వారా ఆశిమచిన ఫలితాలు దక్కుతున్నాయన్నారు. ఇటీవల నూతనంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష ద్వారా 11 రకాల సేవలను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి సమరశీల పోరాటాలు

సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర

విశాలాంధ్ర -మైలవరం : రాష్ట్రంలో ప్రజల సమస్యలు తీవ్రంగా పెరిగిపోయాయని పట్టించుకునే పరిస్థితులలో పాలకు ప్రభుత్వం లేదని, కేవలం భూ కబ్జాలపైనే వారంత దృష్టి పెట్టారని సిపిఐ జిల్లా కార్యదర్శి చంద్ర ఆరోపించారు. శుక్రవారం ఉదయం మండలంలోని దొమ్మర నంద్యాల, వేపరాల, మైలవరం తదితర గ్రామాల యువకులు దాదాపు 50 మంది కృష్ణ మునిరెడ్డి న్యాయకత్వంలో సిపిఐ పార్టీలో జిల్లా కార్యదర్శి గాలి చంద్ర ఆధ్వర్యంలో చేరారు.ఈ సందర్భంగా చంద్ర మాట్లాడుతూ పాలక ప్రభుత్వం ప్రభుత్వ భూములు రియల్ ఎస్టేట్ గా మలుచుకొని వేల కోట్ల రూపాయల అర్జిస్తున్న అధికార యంత్రాంగం కళ్ళుండి గుడ్డివాడిలా వ్యవహరించడం దారుణమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకవైపు పెరిగిన ధరలతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం నిమ్మకు నీరెక్కికినట్లు వ్యవహరించడం దారుణం అన్నారు. జమ్మలమడుగు ప్రాంతంలో ఇసుక దొడ్డి దారిన ఇతర రాష్ట్రాలకు వెళ్ళిపోతున్న అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా ఉందని తెలిపారు. మండలంలో దాదాపు చేనేత వర్గం ఎక్కువగా ఉందని వారికి చిన్న చిన్న సాకులు చూపించి పెన్షన్లు తొలగించడం దారుణమని, చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని అదేవిధంగా వారికి కావలసిన వస్తువులు అన్నీ ప్రభుత్వమే 90 శాతం సబ్సిడీ ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా కార్యదర్శి సుబ్బారెడ్డి, సహాయ కార్యదర్శి ప్రసాదు రైతు సంఘం నాయకులు సుదర్శన్ రెడ్డి, చేనేత కార్మిక సంఘం నాయకులు వరప్రసాద్ పాల్గొన్నారు. పార్టీ చేరిన వారిలో కృష్ణ మునిరెడ్డి, మధు, శంకర్, రమణయ్య, గురు శేఖర్, గురు స్వామి, పీరా ప్రసాదు, వెంకట ప్రసాద్, నాగమయ్య, సుబ్బన్న దాదాపు 50 మంది కార్యకర్తలు సిపిఐ పార్టీలో చేరినవారిలో వున్నారు.

ట్రిపుల్‌ఐటీకి ప్రభుత్వ విద్యార్థుల ఎంపిక

విశాలాంధ్ర-పులివెందుల: స్థానిక ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసిన కౌశిక్, గౌరి అను విద్యార్థులు ట్రిపుల్‌ఐటీకి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ పదో తరగతిలో కౌశిక్‌కు 537 మార్కులు, గౌరికి 661 మార్కులు వచ్చాయన్నారు. ఉత్తీర్ణతాశాతం ఆధారంగా వారికి ట్రిపుల్‌ఐటీలో సీట్లు లభించాయన్నారు. పదో తరగతితో ప్రతిభ చూపిన విద్యార్థులను ఆయనతో పాటు స్నేహితఅమృతహస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు అభినందించారు. భవిష్యత్ మరిన్ని విజయాలు సాధించాలని వారు ఆకాంక్షించారు.

ప్రజారోగ్యాలను పరిరక్షించండి

చైర్మన్‌కు కౌన్సిలర్ వినతి

విశాలాంధ్ర-యర్రగుంట్ల : పురపాలిక పరిధిలోని ఐసీఎల్ సిమెంట్ కర్మాగారం ద్వారా వెలువడుతున్న ధూళి కారణంగా ప్రజల ఆరోగ్యాలు దెబ్బతింటున్న విషయాన్ని పరిగణలోకి తీసుకొని కర్మాగారంపై చర్యలకు ఉపక్రమించాలని పురపాలిక 17వ వార్డు కౌన్సిలర్ ఎరికల్‌రెడ్డి శుక్రవారం మున్సిపల్ చైర్మన్ మూలె హర్షవర్ధన్‌రెడ్డి, కమీషనర్ పగడాల జగన్నాథ్‌లకు అందజేసిన వినతిపత్రంలో కోరారు. ఐసీఎల్ ధూళి సమస్యపై తాను ఇదివరకే అటు యాజమాన్యం, ఇటు ప్రభుత్వ యంత్రాంగం దృష్టికి తీసుకువెళ్లానని వివరించారు. అయినప్పటికీ పరిస్థితిలో ఎలాంటి మార్పు లేని కారణంగా ఆయా ప్రాంతాల్లోని ప్రజల ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నగర పంచాయతీకి ఉన్న అధికారాన్ని వినియోగించి ఐసీఎల్ నుండి ధూళి నియంత్రణకు తగు చర్యలు తీసుకోవాలని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఆర్ఓ గంగిరెడ్డి కూడా పాల్గొన్నారు.

నేడు గడప గడపకు కార్యక్రమంలో ఎమ్మెల్యే

విశాలాంధ్ర-బ్రహ్మంగారి మఠం: నేడు ఉదయం 8:30 గంటలకు మండలంలోని సుగాలితాండ, పాత ఊరు మరియు బి.మఠం సెంటర్‌లో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పాల్గొంటారని ఎంపీడీఓ వెంగమునిరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అదేవిధంగా ఉదయం 10గంటలకు సోమిరెడ్డిపల్లె-1 గ్రామ సచివాలయం, వెలుగు ఆఫీసు ప్రాంగణం నందు జగనన్నా సురక్ష కార్యక్రమం చేపడుతారని తెలిపారు. కావున మండలంలోని ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, గృహసారథులు, వాలంటీర్లతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొనాలని తెలిపారు. మండల స్థాయి అధికారులు కానీ, లేదా సంబంధిత ఉద్యోగులు కానీ గైర్హాజరు అయినచో జిల్లా కలెక్టర్ వారికి తదుపరి చర్యల నిమిత్తం ప్రత్యేక నివేదిక సమర్పించడం జరుగుతుందని తెలిపారు.

ఎన్ఎస్ఎస్ నిధుల వినియోగంపై శిక్షణా తరగతులు

విశాలాంధ్ర-కడప వైవీయూ : పబ్లిక్ ఫైనాన్స్ మేనేజ్మెంట్ విధానం ద్వారా జాతీయ సేవ పథకం నిధుల వినియోగం పారదర్శకత ఉంటుందని రాష్ట్ర పి ఎంఎఫ్ఎస్ ఆఫీసర్ రవికుమార్ అన్నారు. ఎన్ఎస్ఎస్ నిధుల వినియోగంలో భాగంగ ఈ శుక్రవారం వైవియూఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ నిధులను వినియోగ దారులకు, ఇతర ఖాతాలకు ఎలా జమ చేయాలో అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ వైవియూ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్ వెంకటరామిరెడ్డి ఈ నూతన విధానం ద్వారా ఒక క్రమ పద్ధతిలో వినియోగించడమే కాకుండా పారదర్శకత పెరుగుతుందన్నారు. జీరో బ్యాలెన్స్ సబ్సిడరీ అకౌంట్స్ గురించి అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ పిఓల సందేహాల నివృత్తి చేశారు. కార్యక్రమంలో జిల్లాలోని 121 యూని ట్ల ప్రోగ్రాం ఆఫీసర్లు, శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ విశ్వవిద్యాలయ పిఓలు, వై వి యు అధ్యాపకుడు డాక్టర్ రాజగోపాల్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ సిబ్బంది మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

ఇంటికో చెట్టు నాటుదాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలోని నారాయణ స్కూల్ ప్రిన్సి పల్ గీతా ఆధ్వర్యంలో పర్యావరణాన్ని పరిరక్షించా లని కోరుతూ విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు. రాజీవ్ పార్క్ సర్కిల్ నుంచి మహావీర్ సర్కిల్ వరకూ ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు మరియూ టీచర్లు ఒక్కొక్కరు ఒక్కో చెట్టు పట్టుకొని ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం గీతా మాట్లాడుతూ ఏజీఎం చెన్నకేశవ రాజు, ఆర్ఐ కిరణ్ కుమార్ అదేశాల మేరకు ర్యాలీ నిర్వహిం చడం జరిగింది అని అన్నారు. ప్రతి ఇంటికి ఒక చెట్టును నాటాలని పిలుపునిచ్చా రు. ఇంటికో చెట్టు పెంచడం ద్వారా ఆక్షిజన్ శాతం అధికంగా వుండి మనుషులు ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, స్కూలు టీచర్లు పెద్దయెత్తున పాల్గొన్నారు.

భవిష్యత్‌కు భరోసా కరపత్రాలు ఆవిష్కరణ

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : కడప జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మిషన్ రాయలసీమ -భవిష్యత్తుకు భరోసా పోస్టర్, కరపత్రాలు ఆవిష్కరిం చిన రాష్ట్ర తెలుగు యువత నాయకులు కర్నాటి అమరనాథ రెడ్డి, జియా ఉద్దీన్, నల్ల బోతుల నాగరాజు, కర్నాటి చంద్ర ఓబులరెడ్డిల చేతులమీద చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు కర్నాటి అమరనాథ రెడ్డి, నల్లబోతుల నాగరాజు, జియా ఉద్దీన్, శివరాంయాదవ్, బండి సంపత్ మాట్లాడు తూ మిషన్ రాయలసీమ-భవిష్యత్‌కు భరోసా ముఖ్య ఉద్దేశ్యం నారా లోకేష్ కడపలో జరిగిన రాయలసీమ డిక్లరేషన్ కార్యక్రమంలో యువతకు, అన్ని వర్గాల ప్రజలకు ముఖ్యంగా రాయలసీమ ప్రాంతంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత చేయబోయే అభివృద్ధిని వివరించడం జరుగుతుంది. ఇదే కాకుండా చంద్రబాబు నాయుడు భవిష్యత్తుకు భరోసా ద్వారా అన్ని వర్గాలు భవిష్యత్‌కు ఇచ్చిన భరోసాను ప్రజల్లోకి ఉధృతంగా తీసుకెళ్లడమే ముఖ్య ఉద్దేశ్యం గా తెలుగు యువత పనిచేయాలని నాయకులు పిలుపునివ్వడం జరిగింది.ఈ కార్యక్రమం రేపు అసెంబ్లీ వారిగా నియోజకవర్గ ఇంచార్జి సమక్షంలో పోస్టర్ పామ్ ప్లేట్స్ ఆవిష్కరిస్తారు. తర్వాత 17 వ తేదీ నుండి తెలుగు యువత నాయకులు ప్రజల్లోకి వెళ్లే విధంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కడప పార్లమెంట్ తెలుగు యువత నాయకులు రహీమాన్, శివరాం యాదవ్, బండి సంపత్, కడప అసెంబ్లీ తెలుగు యువత వెంకటేష్ యాదవ్, సంఘం ఉదయ్ కుమార్, హరినాథ రెడ్డి, ఐటీడీపీ మణికంఠ, ఆకేటి అర్జున్ పాల్గొన్నారు.

జగనన్నా సురక్షతో సమస్యలు పరిష్కారం:ఎంపీపీ

విశాలాంధ్ర-బ్రహ్మంగారి మఠం: మండల పరిధిలోని డిరసవంచ పంచాయతీలో ఉన్న గ్రామాల వారీగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా జగనన్నా సురక్ష ద్వారా అధికారులు మన గ్రామాలలో అధికారులు పర్యటించి మన సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు కృషి చేస్తున్నారని మండల అధ్యక్షులు చిలెకంపల్లె వీరనారాయణ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం డిరసవంచ పంచాయతీలోని సర్పంచ్ రాళ్లపాటి అమీర్‌బాష ఆధ్వర్యంలో జగనన్నా సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సమావేశానికి బిజివేముల మోహన్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సంధర్భంగా ఎంపీపీ వీరనారాయణ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలలో ప్రజా సమస్యలు పరిష్కరించేవిధంగా వాలంటీర్ల ద్వారా అధికారులు గ్రామాలలోకి వచ్చి ప్రజాసమస్యలను పరిష్కరించే విధంగా జగనన్నా సురక్ష కార్యక్రమంతో అర్హులైన కుటుంబానికి సంక్షేమ పథకాలు, 11రకాల సర్టిఫికెట్లను అందచేస్తూ మరియు అనర్హులైన వారిని కూడ గుర్తించి ప్రభుత్వ పథకాలను వారికి కూడ అందేవిధంగా జగనన్నా ప్రవేశపెట్టారని, ప్రతి ఒక్కరికి ఈ సంక్షేమ పథకాలు అందేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని అన్నారు. గతంలో ఇన్‌కం, క్యాస్ట్‌కు వెల్లాలంటే అధికారుల చుట్టు తిరిగేవారని ఇప్పుడు ఇంటివద్దకే అందిస్తు న్నామని తెలిపారు. మండల అభివృద్ధి అధికారి వెంగమునిరెడ్డి మాట్లాడుతూ మీ గ్రామంలోని సచివాలయాల ను ఉంచి అధికారులు గ్రామాలలోనే ఉండటం, సమస్యలు కూడ ఎప్పటికప్పుడు అధికారులు పరిశీలిస్తూ ఉన్నారని అన్నారు. తహసీల్దార్ సువర్ణ దేవి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్నా సురక్ష ద్వారా ఇన్‌కం, క్యాస్ట్‌తో పాటు అర్హులైన ముటేషన్ ద్వారా అందియడం జరుగుతుందని అన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు నాగిపోగు గంగమ్మ, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

పచ్చి మేతతో అధిక పాల దిగుబడులు

విశాలాంధ్ర-చెన్నూరు : రైతులు పచ్చి మేత అందించినట్లయితే అధిక పాల దిగుబడులు పొందవచ్చని పశు సంవర్ధక శాఖ జిల్లా ఉప సంచాలకులు వెంకట రమణయ్య ఏడి శ్రీనివాసులు రెడ్డిలు అన్నారు. శుక్రవారం స్థానిక పశువైద్యాధికారి ఉపేంద్ర అధ్యక్షతన స్థానిక రైతు భరోసా కేంద్రంలో జరిగిన పశుగ్రాస వారోత్సవాలలో భాగంగా నిర్వహించిన అవగాహన సదస్సులో వారు పాల్గొన్నారు. ఈ ఈ అవగాహన సదస్సుకు ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సందర్భంగా పైవారు మాట్లాడుతూ ప్రతి పాడి రైతు తమకున్న వ్యవసాయ భూమిలో 10 శాతం మేర పశుగ్రాసం పెంచుకోవాలన్నారు. గెనుపుల గడ్డి నాటుకున్నట్లయితే ఐదు నుండి ఆరు సంవత్సరాల వరకు కోత కోస్కోవచ్చని ఆయన అన్నారు. ప్రభుత్వం సబ్సిడీతో పశుగ్రాస విత్తనాలతో పాటు దానా కూడా రైతులకు అందివ్వటం జరుగుతుందని ఆయన వివరించారు. పాడే రైతులే కాక గొర్రెల కాపర్లు కూడా తమకున్న వ్యవసాయ భూమిలో పశుగ్రాసం పెంచుకుని గొర్రెలకు పొట్టేళ్లకు అందించినట్లయితే తక్కువ కాలంలోనే ఎక్కువ బరువు పెరిగి లాభాలు పొందవచ్చని ఆయన అన్నారు.. అంతేకాక కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ పథకం ద్వారా 50% రాయితీతో కోటి రూపాయల వరకు బ్యాంకు రుణాలు అందివ్వడం జరుగుతుందని వ్యవసాయ భూములు ఉండి ఆసక్తిగల రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ జి ఎన్ భాస్కర్ రెడ్డి మండల రైతు సంఘం నాయకులు ఎర్రసైన్యం మోహన్ రెడ్డి కొండపేట సర్పంచ్ చంద్ర యాదవ్ కమలాపురం మార్కెట్ డైరెక్టర్ గోర్ల పుల్లయ్య గారి బాబు రైతులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

విశాలాంధ్ర-పులివెందుల: పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మలేరియా సబ్‌యూనిట్ అధికారి సిద్దయ్య అన్నారు. సింహాద్రిపురం మండలం కెజి పల్లి పిహెచ్‌సి పరిధిలోని లోమడ, దిద్దెకుంట గ్రామాల్లో డెంగ్యూ నివారణ దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్దయ్య మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు వచ్చే సూచన ఉన్నందున ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా వర్షపునీరు నిల్వలేకుండా చూసుకోవా లన్నారు. వర్షపునీరు నిల్వ ఉన్నచోటే అక్కడ దోమలు సంతానోత్పత్తి అధికంగా ఉంటుందన్నారు. దోమకాటు వల్ల మలేరియా, డెంగ్యూ, చికున్నగున్యా తదితర వ్యాధులు ప్రబలుతాయన్నారు. దోమకుట్టుకుండా పుట్టకుండా చూసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు పాత్రలను శుభ్రం చేసుకోవాలన్నారు. జ్వరాలు వచ్చినట్లయితే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లాలన్నారు. తప్పని సరిగా వైద్యులు సలహాలు, సూచనలు పాటించాల్సి ఉందన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాల న్నారు. నీటి కొళాయిల వద్ద నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. చీకటిపడగానే ఇంటి కిటికీలు మూసివేయాలని, దీని వల్ల దోమలు ఇంటిలోకి ప్రవేశించే అవకాశం ఉండదన్నారు. అలాగే రాత్రిపూట ప్రతి ఒక్కరూ దోమతెరలు వాడాలని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఖలీల్‌బాసా, ఆరోగ్య కార్యకర్తలు భాస్కర్, సూరి, సీహెచ్‌ఓ రెడ్డెమ్మ, అంకాలమ్మ, శశికళ పాల్గొన్నారు.

ప్రజల సేవలో జగనన్న ప్రభుత్వం:ఎమ్మెల్యే

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ద్వారా ప్రజల ముంగిట అన్ని రకాల సేవలు అందుతున్నాయని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని వసంతపేట-1, 27వ వార్డుల లో ఎమ్మెల్యే రాచమల్లు ఆధ్వర్యంలో జగనన్నా సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిం చారు. జగనన్నా సురక్ష ద్వారా ఒక్క రూపాయి ఖర్చు లేకుండా రేషన్‌కార్డు, క్యాస్ట్, ఇన్‌కం వివిధ రకాల సర్టిఫికెట్లను మంజూరు ప్రజలకు ఎమ్మెల్యే అందించారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే రాచమల్లు మాట్లాడుతూ 14ఏళ్ల చంద్రబాబు పాలనలో ప్రజలకు చేసింది ఏమీలేదని అన్నారు. 11రకాల సర్టిఫికెట్ల కోసం ప్రజలు కార్యాలయాల చుట్టు తిరగకుండా తక్షణం సచివాలయాల ద్వారా అందించేందుకు ప్రభుత్వం జగనన్నా సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీల పరిధిలో వాలంటీర్ల ద్వారా అర్హులైన లబ్దిదారులను గుర్తించి పెన్షన్లు, అమ్మఒడి తదితర పథకాలను అందిచడం జరుగుతుందని అన్నారు. కులమతాలకు, పార్టీలకు అతీతంగా తమ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అందిస్తోందని వివరించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అభివృద్ధికి పట్టం కట్టాలని అన్నా రు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ భీమునిపల్లె లక్ష్మీదేవి నాగరాజు, వైస్‌చైర్మెన్ బంగారురెడ్డి, కన్వీనర్ పోసాభాస్కర్, మున్సిపల్ అధికారులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో వాసవి మాత

విశాలాంధ్ర - మైదుకూరు : మైదుకూరు అమ్మవారిశాలలో శాకాంబరిదేవి అలంకారంలో శ్రీ వాసవి మాతాకు ఆషాడ మాసం సందర్భంగా వివిధ కూరగాయలు ఆకుకూరలతో అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో మహిళలచే ప్రత్యేకంగా పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే ఈ సందర్భంగా ఆర్యవైశ్య అధ్యక్షుడు సూరిశెట్టి ప్రసాద్ గుప్తా మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఆషాడ మాసంలో అమ్మవారికి ప్రత్యేకంగా కూరగాయలతో అమ్మవారి అలంకరణ చేస్తామని ఆయన అన్నారు.

మేము సైతం.. తల్లిదండ్రులకు చేదోడుగా తనయులు

విశాలాంధ్ర-పులివెందుల: అనగనగా ఓ ఇరువురు విద్యార్థులు.. వారిరు వులు అక్కాతమ్ముడు.. వారి పేర్లు దీక్షితారెడ్డి దీరజ్ కుమార్‌రెడ్డి.. వారు ఎంచక్కా చదువుతారు.. క్రమం తప్పకుండా పాఠశాలకు వెళతారు.. ఇంటి వచ్చిన తర్వాత హోమ్‌వర్క్‌తో పాటు ఏరోజుకారోజు ఉపాధ్యా యులు చెప్పిన పాఠాలను శ్రద్ధగా నేర్చుకుం టారు.. అంటే మేము సైతం.. అంటూ సెలవు దినాలు, తీరిక దొరికిన సమయంలో తల్లిదండ్రులకు చేదోడుగా ఉంటారు..ఒక వైపు చదువుకుంటూనే మరో వైపు వ్యవసాయంపై మొగ్గు చూపుతారు.. వివరాల్లోకి వెళితే.. తొండూరు మండలం తేలూరు తుమ్మలపల్లెకు చెందిన కోరా నాగజ్యోతి నాగిరెడ్డి దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరి బిడ్డలే దీక్షితారెడ్డి, దీరజ్‌కుమార్‌రెడ్డిలు. తీరిక సమయంలో పొలం వద్దకు వెళ్లగానే కాసేపు సేద్యం చేస్తారు. మేడిపట్టి దుక్కులు దున్నుతారు. వ్యవసా యంలో తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా ఉంటూ కొంతైనా భారం తగ్గించాలన్నది వారి ఆకాంక్ష. అసలు విషయాని కి వస్తే నేటి కాలపు కొంత మంది పిల్లలు తల్లిదండ్రులను చూడకుండా ఉండరేమోకానీ సెల్‌ను చూడకుండా ఉండలేరు. సెల్ చేతిలో ఉంటేనే పొద్దు గడస్తుందని భావిస్తారు. అరచేతిలో అంతర్జాల సమాచారాన్ని గ్రహిస్తున్న నేటి తరం పిల్లలకు దీక్షితారెడ్డి, దీరజ్‌కుమార్‌రెడ్డిలు ఒక స్ఫూర్తి.

ఉచిత మెగా న్యూరో వైద్య శిబిరం

విశాలాంధ్ర-పోరుమామిళ్ల : ప్రజల ఆరోగ్యం కోసం, నగరాలకు పరిమితం అయిన వైద్యం మారుమూల గ్రామ ప్రజలకు అందుబాటులో ఉంచడం కోసమే ఉచిత మెగా న్యూరో వైద్య శిబిరం నిర్వహించామని సర్పంచు రవి ప్రకాష్ రెడ్డి తెలిపారు.శుక్రవారం పోరుమామిళ్ళ పట్టణంలోని బ్రయాన్స్ మల్టి స్పెషాలిటీ ఆసుపత్రి నందు ఉచిత మెగా న్యూరో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య శిబిరానికి మంచి స్పందన వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా 435 మంది పేషెంట్లకు కడపలో ఎస్వి నవీన్ న్యూరాలజీ హాస్పిటల్ నిర్వాహకులు ప్రముఖ న్యూరాలజీ డాక్టర్ నవీన్ ప్రసాద్ ఉచితంగా పరీక్షలు నిర్వహించి నెలకు సరిపడే మందులు అందజేశారు. వివిధ రకాల వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న వారికి ఉచితంగా బీపీ, షుగర్,ఎముకల సాంద్రత పరీక్షలు నిర్వహించా రు. ఈ కార్యక్రమంలో ట్రస్టు నిర్వాహకులు చిత్తా గిరిప్రనీత రెడ్డి, ప్రజ్వలారెడ్డి, డా. మౌనికా రెడ్డి, అదూరి థామస్ రెడ్డి, విదేశీయులు జాన్, థామస్, జడ్పిటిసి ముత్యాల ప్రసాద్, వైస్ సర్పంచ్ ప్రసాద్ , ఎస్వి నవీన్ ప్రసాద్ హాస్పిటల్స్ సిబ్బంది, బ్రయాన్స్ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నందు పంట నమోదు చేసుకోవాలి

విశాలాంధ్ర-కొండాపురం: ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగుచేసి న ప్రతి పంటను ఈ క్రాప్ ద్వారా నమోదు చేసుకోవాలని, దీని ఆధారంగా ప్రభుత్వం రాయితీ ఇస్తుందని మండల వ్యవసాయశాఖ అధికారి రామాంజల్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కొండాపురం లోని సచివాలయం -2నందు రైతుభరోసా కేంద్రం ఇంచార్జ్‌లతో కలిసి సమావేశం ఏర్పాటుచేశారు. ఆయన మాట్లాడుతూ పీఎం కిసాన్‌కు సంబంధించిన ఈకేవైసీ పూర్తి చేసుకొని రైతులు తొందరగా పూర్తి చేసుకోవాలని అన్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులకు కావాల్సిన ఎరువులు అందుబాటులో ఉన్నాయని సద్వినియోగం చేసుకోవాలని, ఇంకా ఏవైన ఎరువులు కావాల్సిన రైతులు రైతుభరోసా కేంద్రాలలో సిబ్బందికి తెలియజేస్తూ కావాల్సిన ఎరువులు అందచేస్తామని, ఖరీఫ్ సీజన్‌లో గ్రామాల వారీగా సాగుచేసిన పంటల వివరాలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పంటల వివరాలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వరి పంటను సాగు చేయి రైతులు తూర్పు, పడమర దిశగా కాలిబాటలు తీసేవిధంగా రైతులకు అవగాహణ కల్పించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రమేష్, అశోక్‌రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలకు కేరాఫ్ టీడీపీ

విశాలాంధ్ర - వల్లూరు : బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసమే టిడిపి పార్టీ ఉద్భవించిందని తెలుగుదేశం ఉపాధ్యక్షుడు కమలాపురం నియోజ కవర్గం ఇంచార్జ్ పుత్త నరసింహారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తప్పెట్ల గ్రామపంచా యతీలో భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటికి వెళ్లి తెలుగుదేశం పార్టీ ఇచ్చే సంక్షేమ పథకాలను వివరిస్తూ ముందుకు వెళ్లారు. సంక్షేమ పథకాలు కేరాఫ్ టిడిపి తోనే అని ఆయన ప్రజలకు తెలియజేశా రు. మహిళ భద్రత ఆర్థిక స్వాలంబన కోసం 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఆడబిడ్డకు నెలకు 1500 రూపాయలు ఇస్తామని ప్రతి కుటుంబంలో ఎంతమంది పిల్లలు చదువుతుంటే వారందరికీ ప్రతి సంవత్సరం 15 వేల రూపాయలు అందజేస్తామని భరోసా ఇచ్చాడు. నిరుద్యో గ యువతకు ప్రతి నెల 3000 రూపాయలు నిరుద్యోగ భృతి అందిస్తామని తెలియజేశారు. రైతే దేశానికి వెన్నెముక అంటూ ప్రతి రైతుకు ఏటాకు 20వేల రూపాయలు ఆర్థిక సహాయం అందిస్తామన్నారు. దీపం పేరుతో ప్రతి ఇంటికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామ న్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు లేబాక నాగేశ్వర్ రెడ్డి, తాడి గోట్ల రాఘవరెడ్డి, మాజీ సర్పంచ్ కె.శ్రీనివా సుల రెడ్డి, టి.శ్రీనివాసుల రెడ్డి,టి. మల్లికార్జున రెడ్డి, గడికోట సుధాకర్ రెడ్డి, చల్ల సునీల్ కుమార్ రెడ్డి, జె సుబ్బా రెడ్డి, రామ సుబ్బారెడ్డి, సుబ్బరామిరెడ్డి, రఘునాథ్ రెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, నాగసుబ్బారెడ్డి, వెంకటసుబ్బరాయుడు, ఓబులేసు చిట్టిబాబు, సద్దాం హుస్సేన్ , టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

'సురక్ష'తో ఉచిత సేవలు

- సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి
- మున్సిపల్ చైర్మెన్ హర్షవర్ధన్

విశాలాంధ్ర-యర్రగుంట్ల : రాష్ట్రాన్ని సుభిక్షంగా ఉంచే శక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే ఉందని మున్సిపల్ చైర్మన్ మూలె హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. స్థానిక 7వ సచివాలయ పరిధిలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఆయా వార్డుల కౌన్సిలర్లు షేక్ జంషిద్, హేమ లత, వార్డుల ఇన్‌చార్జిలు ఆర్ఎస్ షాహీద్, రాచమల్లు రాజవర్ధన్‌రెడ్డితో కలిసి చైర్మన్ దరఖాస్తుదారులకు ధృవీకరణ పత్రాలు అందజేశారు. పూలమాలలు, దుశ్శాలువలతో చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ నందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ యజ్ఞంలా జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతోందన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నది తమ వైసీపీ ప్రభుత్వమేనని ఆయన ఉద్ఘాటించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి కార్యక్రమం ప్రజలకు మేలు చేసేదేనన్నారు. గత ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాల కోసం జన్మభూమి కమిటీ సభ్యుల చుట్టూ ప్రదక్షిణలు చేసి ఎంతో కొంత సమర్పించుకునే దుస్థితి ఉండేదని నేడు ఆ పరిస్థితి లేదన్నారు. అర్హతే ప్రామాణికమన్నారు. ప్రజలకు మంచి చేస్తున్న ప్రభుత్వంపై విపక్షాలు బురదజల్లే ప్రయత్నాలు మాను కోవాలని ఆయన హితవు పలికారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ పగడాల జగన్నాథ్, ఆర్ఓ గంగిరెడ్డి, మేనేజర్ పుల్లయ్య, డీపీఓ వినోద్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి, సున్నపురాళ్లపల్లె సింగిల్‌విం డో అధ్యక్షులు ఆర్.ప్రతాప్‌రెడ్డి, పార్టీ సీనియర్ నేతలు నిడిజువ్వి రాజారెడ్డి, చింతా బాబుల్‌రెడ్డి, గఫూర్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

పక్కీరగార్ల రవికుమార్ తండ్రి పక్కీరగార్ల ఓబులేసు, నివాసం ఇంటి నెం. 7/26-ఎ, రామాలయం వీధి, అచ్చమ్మ పేట గ్రామం, ఒంటిమిట్ట మండలం, వైఎస్ఆర్ జిల్లా. నేను అచ్చమ్మపేట నుండి ఒంటిమిట్టకు జిరాక్స్ కోసం పోవుచుండగా మార్గమధ్యంలో నా పాస్‌పోర్టు పోయినది. నాయొక్క పాస్‌పోర్టు నెం. **టి3499469.** ఈ పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన యెడల పై అడ్రస్‌కు గానీ క్రింది ఫోన్ నెంబరుకుగానీ తెలుపగలరు. తగిన పారితోషికం ఇవ్వబడును.

ఫోన్ నెం: 6305859240

పాస్‌పోర్టు పోయినది

వీరబత్తిని లీలావతి తండ్రి వీరబత్తిని దేవరాజ్, నివాసం. ఇంటి నెం. 2/114, బాబానగర్, అంగన్‌వాడివీధి, చింతకొమ్మదిన్నె, కడప జిల్లా. జిరాక్స్ కోసం కడప లో 7 రోడ్స్‌కు పోవుతుండగా నాయొక్క పాస్‌పోర్టు దారిపోయి నది. పాస్‌పోర్టు నెం. ఎన్8125510. ఈ పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన యెడల పై అడ్రస్‌కు గానీ క్రింది ఫోన్ నెంబరుకు గానీ తెలుపగలరు. తగిన పారితోషికం ఇవ్వబడును.

ఫోన్ నెం: 8978966429

విశాలాంధ్ర



అన్నమయ్య జిల్లా

ధర్మనాయక్‌ను అభినందించిన ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

విశాలాంధ్ర-సుండుపల్లె : అన్నమయ్య జిల్లా సమాచార శాఖ పిఆర్‌ఓ, టి.సుండుపల్లె మండలం, యర్రమనేనిపాలెం, కుప్పగుట్టకు చెందిన బుక్కె ధర్మనాయక్ కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వశాఖ నందు ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్ నందు సీనియర్ గ్రేడ్ గెజిటెడ్ ఆఫీసర్ ఉద్యోగం సాధించడం గర్వకారణంగా ఉందని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం రాయచోటి పట్టణంలోని వైఎస్ఆర్ సిపి కార్యాలయంలో ఎంఎల్ఏ ను మర్యాదపూర్వకంగా ధర్మానాయక్ తన ఉన్నతాధికారులతో కలిశారు. ఈ సందర్భంగా ధర్మానాయక్‌ను ఎమ్మెల్యే అభినందించి హృదయ పూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. అన్నమయ్య జిల్లా సమాచార మరియు పౌర సంబంధాల శాఖ అధికారి భరత్ కుమార్ రెడ్డి, డిపిఆర్ఓ సిహెచ్ పురుషోత్తం, ఎంపిడిఓ మల్ రెడ్డిలు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష కార్యక్రమంతో పేదల సమస్యలు పరిష్కారం:చైర్మన్

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంతో పేద, బడుగు, బలహీన వర్గాల సమస్యలు పరిష్కారం అని అన్నమయ్య జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు ఆదేశాల మేరకు శుక్రవారం ఉల్లగట్టుపోడు గ్రామ సచివాలయంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11 రకాల సేవలు సర్వీస్ ఛార్జీ లేకుండా ఉచితంగా అందిస్తున్నామన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని స్థానిక ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఎంపిడిఓ జాషువా, జెడ్పిటిసి పాలెంకోట రత్నమ్మ, సర్పంచ్ కోటగుండ్ల గోపి, ఎంపిటిసి రాజా, సచివాలయ కన్వీనర్ దమ్ము రఘు, మాజీ సర్పంచ్ రామిరెడ్డి ఓబుల్ రెడ్డి, గృహ సారథులు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.మైసూరువారిపల్లిలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఇఓపిఆర్డి సిహెచ్ నాగార్జునరావు, సర్పంచ్ కారుమంచి సంయుక్త, పంచాయితీ సెక్రటరీ మహేష్, విఆర్ఓ శంకరయ్య, విఆర్ఏ బత్తిన సుబ్రమణ్యం, కన్వీనర్లు, గృహ సారథులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

తెలుగుదేశంతోనే రాష్ట్ర అభివృద్ధి: మాజీ ఎమ్మెల్యే

విశాలాంధ్ర-గాలివీడు:తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని మాజీ ఎమ్మెల్యే రాయచోటి నియోజకవర్గం టిడిపి ఇంచార్జ్ ఆర్ రమేష్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.శుక్రవారం ఆయన మండలంలోని గోరాన్ చెరువు పంచాయతీలో రాష్ట్ర భవిష్యత్తుకు చంద్రబాబు గ్యారెంటీ,ఇదేమి కర్మ రాష్ట్రానికి అనే కార్యక్రమాలను నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో ఒక ఛాన్స్ అంటూ ప్రజలకు మాయ మాటలు చెప్పి జగన్ ఎన్నికలలో గెలుపొందారన్నారు.ఈ నాలుగు సంవత్సరాలలో జగన్ చేసిన అరాచకం ప్రజలకు అర్థం అయిపోయిందని ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ప్రజలు వైసీపీని సాగనంపడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కుటుంబంలోని విద్యార్థులందరికీ 15 వేల రూపాయలు అందించడంతోపాటు,జిల్లా పరిధిలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం,18 సంవత్సరాలు నిండిన మహిళలకు నెలకు 1500 రూపాయలు ,సంవత్సరానికి మూడు గంటల సిలిండర్లు ,రైతాంగానికి సంవత్సరానికి రూ.20,000 రూపాయలు అందించడం జరుగుతుందని స్పష్టం చేశారు.అనంతరం ఒడిసిలంకపల్లె ,గేటు కాడపల్లె, కరిమిరెడ్డి గారిపల్లె లో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలను ప్రజల దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకటనారాయణ రెడ్డి,మాజీ సర్పంచులు ప్రభాకర్ నాయుడు,చిన్నపరెడ్డి,భద్రప్ప నాయుడు,మహమ్మద్ రియాజ్,మాజీ ఎంపీటీసీలు రెడ్డి ప్రసాద్ రెడ్డి,టిడిపి మండల నాయకులు ప్రభాకర్ రెడ్డి,రెడ్డప్ప రెడ్డి,రాఘవులు, శ్రీకాంత్ రెడ్డి,మహబూబ్ బాషా,గూడుసాబ్ ,జక్రియ భాష,తదితరులు పాల్గొన్నారు.

మిట్స్ కళాశాలలో కమ్యూనిటీ రేడియో ప్రారంభం

విశాలాంధ్ర :మదనపల్లె: మదనపల్లె సమీపంలో గల మదనపల్లె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్స్ నందు ఇటీవల మిట్స్ కమ్యూనిటీ రేడియో 90.8ను ప్రారంభించడం జరిగింది అని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. యువరాజ్ అన్నారు. ఈ రేడియో ద్వారా ప్రతి రోజు ఉదయం 6:00 నుంచి 7:00 వరకు భక్తి సంగీతం, మధ్యాహ్నం 12:00 నుంచి 2:00 వరకు మరియు సాయంత్రము 4:00 నుంచి 6:00 వరకు ప్రసార కార్యక్రమాలు ను మరియు 6:00 నుంచి 7:00 వరకు సినిమా పాటలను ప్రసారం చేస్తారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమాలను మొబైల్ యాప్ ద్వారా మరియు రేడియో ల ద్వారా వినవచ్చని అన్నారు. మొబైల్ లో ప్లే స్టోర్ ద్వారా మిట్స్ కమ్యూనిటీ రేడియో 90.8 ఇన్స్టాల్ చేసుకోవచ్చుని, రేడియో ద్వారా 90.8 నందు ప్రసారం అవుతున్నాయని, ప్రతి ఒక్కరు కార్యక్రమంలను విని ఆస్వాదించాలని ఆయన అన్నారు.

ప్రభుత్వ వైద్యశాల గైనకాలజిస్ట్‌గా డాక్టర్ శ్రీలత బాధ్యతలు

విశాలాంధ్ర-పీలేరు : పీలేరు ప్రభుత్వ వైద్యశాల సిసిఎస్ గైనకాలజిస్ట్ గా డాక్టర్ శ్రీలత గురువారం బాధ్యతలు స్వీకరించారు. రాజంపేట నుండి పీలేరు ప్రభుత్వ వైద్యశాలకు బదిలీపై వచ్చిన డాక్టర్. శ్రీలతను ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్. చంద్రశేఖర్ వారి బృందం తో కలిసి స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపి డాక్టర్ శ్రీలత దంపతులను ఘనంగా సన్మానించారు. ఇకపై మరింత సేవలు అందించడానికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ పీలేరు వైద్యశాలకు ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్.రవిశంకర్ రెడ్డి, డాక్టర్ .నాగవేణి, డాక్టర్.భారతి దంపతులు, నర్సింగ్ సిబ్బంది, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యేల సేవలకు సార్థకత కల్పించాలి

రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్

విశాలాంధ్ర-పీలేరు :-పీలేరు నియోజకవర్గ ప్రజల సంక్షేమానికి, ఈ ప్రాంత అభివృద్ధికి ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిలు అందిస్తున్న సేవలను గుర్తించి వారిని ఆదరించడం ద్వారా సార్థకత కల్పించాలని రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్ అన్నారు. వాల్మీకిపురం మండలం మంచూరులో గురువారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎంపీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిల సహకారంతో మంచూరులో రూ. కోటి 70 లక్షలతో శ్రీ సోమేశ్వర స్వామి ఆలయ జీర్ణోద్ధరణ పనులను చేపట్టడం గమనార్హం అన్నారు. నియోజకవర్గంలోని ప్రధాన ప్రతిపక్ష నాయకుడు ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రమే ప్రజలకు కనిపిస్తాడని, ఎన్నికలు అయిపోయాక ఆయనకు నియోజకవర్గ ప్రజలు గానీ, నియోజకవర్గంగానీ కనిపించదన్నారు. హైదరాబాదులో ఉంటూ విజిటర్లుగా నియోజకవర్గానికి అడపాదడపా వచ్చే ప్రతిపక్ష నాయకులను నమ్మి మోసపోరాదన్నారు. ఎల్లవేళలా ప్రజలతో మమేకమై సేవలందిస్తున్న ఎంపీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి లకు అండగా నిలిచి చేయూత నివ్వాలని కోరారు. పేదరికమే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత దేశంలోనే రాష్ట్రంలోని వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వానికి మాత్రమే దక్కుతుందన్నారు. రాజంపేట పార్లమెంటరీ నియోజకవర్గ వైసీపీ బీసీ సెల్ కార్యదర్శి రాయుడు మాట్లాడుతూ పరిపాలనను ప్రజలకు చేరువగా తీసుకువచ్చిన సీఎం జగన్మోహన్ రెడ్డిని ప్రతి ఒక్కరూ ఆదరించాలన్నారు. ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చేందుకే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి తహసిల్దారు ఫిరోజ్ ఖాన్ అధ్యక్షత వహించగా, ఎంపీటీసీ రెడ్డమ్మ, స్థానిక నాయకులు శంకర్ రెడ్డి , చిన్న, నాగరాజు, పంచాయతీ కార్యదర్శి పాండురంగం, సచివాలయ కార్యదర్శి, ఉద్యోగులు, వాలంటీర్లు,వివిధ శాఖల సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆదర్శ ఉద్యోగులకు ప్రోత్సాహకాలు:డియం

విశాలాంధ్ర-పీలేరు:పీలేరుడిపోలోఆదర్శ ఉద్యోగులకు ప్రోత్సాహకాలు అందించామని పీలేరుడిపోడియం.బండ్ల కుమార్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాటలాడుతు పీలేరు డిపోలో ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ ఏర్పాటు చేసి అత్యధిక ఇంధన పొదుపు సాధించిన డ్రైవర్లుకు నగదు బహుమతి ప్రదానం చేయడమైనదని తెలిపారు.ఇంధన పొదుపు వలన డిపో పై ఖర్చు తగ్గడం అంటే మనం అంత ధనం ఆదా చేసినట్లే కనుక ప్రతి డ్రైవర్ ఇంధన పొదుపుపై శ్రద్ధ వహించి డిపోని అత్యధిక ఇంధన పొదుపు డిపోగా తీసుకురావాలన్నారు.

అంగన్వాడి భవనాలను త్వరగా పూర్తి చేయాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో ఐసిడిఎస్ అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: నాడు నేడులో మంజూరైన అంగన్వాడి బిల్డింగ్ లన్నింటిని త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గిరిషా పి.ఎస్ ఐసిడిఎస్ సిడిపిఓ సూపర్వైజర్ లను ఆదేశించారు. శుక్రవారం అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో ఐసిడిఎస్ సిడిపిఓ, సూపర్వైజర్ లతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రూఫ్ లెవల్ లో ఉన్న బిల్డింగ్ లను ఈ నెల ఆఖరికి పూర్తి చేయాలన్నారు. నవజాతి శిశువు నుంచి ఆరు నెలలు, ఏడు నెలల నుంచి 36 నెలలు, 37 నెలల నుంచి 72 నెలల పిల్లల పెండింగ్ ఆధార్ ఎన్ రోల్ మెంట్ త్వరగా పూర్తి చేయాలన్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఉండాల్సిన బరువు కన్నా తక్కువ, ఉండాల్సిన ఎత్తు కన్నా తక్కువ ఉన్న పిల్లల పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. వై.ఎస్.ఆర్ సంపూర్ణ పోషణ కిట్స్ బాలాంమృతం, గుడ్లు, పాలు, బియ్యం, కందిపప్పు, నూనె క్వాలిటీని ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఐసిడిఎస్ పిడి ధనలక్ష్మి, సిడిపిఓలు, సూపర్వైజర్లు, ఐ.సి.డి.ఎస్ సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

జిఓ నెంబర్ 21, 31ని రద్దు చేయాలి

ఏఐటీయూసీ, ఆటో వర్కర్స్ యూనియన్ డిమాండ్

విశాలాంధ్ర -రాజంపేట: రాష్ట్రంలో ఆటో, ట్రాన్స్పోర్టు కార్మికులపై పెద్ద మొత్తంలో జరిమానాలు విధించేలా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జిఓ 21,31ని తక్షణమే రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తుమ్మల రాధాకృష్ణ సాంబశివ, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎమ్మెస్ రాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆటో వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఏపీ ఆటో డ్రైవర్స్, వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్ తో ప్రదర్శన నిర్వహించి అనంతరం ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహన యజమానులతోపాటు ఆటో డ్రైవింగ్ లైసెన్సు ఉన్న ప్రతి కార్మికునికీ వాహన మిత్రను అమలు చేయాలన్నారు.వాహన మిత్రతో ఆటో కార్మికులకు ఎలాంటి న్యాయం జరగదన్నారు. ఈ పథకానికి ఎక్కువ మంది ఆటో కార్మికులను అనర్హులను చేయాలనే ప్రభుత్వం కేవలం యజమానులకే ఇస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మోటార్ వెహికల్ చట్టసవరణతో మొత్తం ట్రాన్స్పోర్టు రంగమే సంక్షోభంలోకి పోయిందన్నారు. కేంద్రం తెచ్చిన చట్టసవరణతో రాష్ట్ర ప్రభుత్వం భారీ జరిమానాలకు జిఓలను జారీ చేసిందన్నారు. ఆటో కార్మికులకు పిఎఫ్, ఈయస్ఐ తో కూడిన ఒక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.రోజురోజుకూ ఆటో నడుపుకుంటున్న కుటుంబాలు తీవ్రంగా ఇబ్బందులు పడుతుంటే రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికుల మీద మోయలేని భారాన్ని మోపుతున్నదన్నారు.మున్సిపాలిటీ పంచాయతీలలో ఆటోలు నిలుపుకోవడానికి పార్కింగ్ స్థలాలను కేటాయించాలని, ఆటో డ్రైవర్లకు ఇంటి స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాజంపేట పట్టణ కార్యదర్శి సికిందర్,ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు నాగేశ్వరరావు, గంగయ్య,సుబ్బారాయుడు, చోటు,యల్లారెడ్డి,మస్తాన్,శీను, బ్రహ్మయ్య, సురేష్, వెంకటేష్, గంగాధర్, విజయ్ భాస్కర్, లక్ష్మి నారాయణ,ఆది నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సమాఖ్య రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలి

సిపిఐ అన్నమయ్య జిల్లా కార్యదర్శి పిఎల్ నరసింహులు పిలుపు

విశాలాంధ్ర - రైల్వేకోడూరు: ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య రాష్ట్ర మూడవ మహాసభలు జయప్రదం చేయాలని సిపిఐ అన్నమయ్య జిల్లా కార్యదర్శి పిఎల్ నరసింహులు పిలుపునిచ్చారు. శుక్రవారం ఓబులవారిపల్లి మండలంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 27 నుండి 30వ తేదీ వరకు నాలుగు రోజులు పాటు రాయచోటి పట్టణంలో జరిగే మహాసభ విజయవంతానికి ఆర్థిక సహాయం అందించి సహకరించాలంటూ కరపత్రాలు అందజేస్తూ విస్తృత ప్రచారం చేపట్టారు. స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు అవుతున్న గిరిజనులు అభివృద్ధికి నోచుకోకపోవడం దారుణం మన్నారు. ఇప్పటికీ అనేక గిరిజన గ్రామాల్లో కరెంటు, రోడ్డు సౌకర్యం, త్రాగునీరు, విద్యా, వైద్యం అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గిరిజనుల సమస్యలపై అనునిత్యం ఆర్థిక, రాజకీయ అసమానతులపై పోరాడుతున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనుల అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఒట్టి మాటలు చెబుతున్నారే తప్ప గిరిజనులు గురించి పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మూడవ మహాసభతో గిరిజనులలో సంచలనాత్మక మార్పులు రానున్నాయన్నారు. సుదీర్ఘ స్వతంత్ర దేశంలో ప్రభుత్వాలు పాలకులు మారుతున్న గిరిజనుల స్థితిగతులు మాత్రం దిగజారిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రకృతి సిద్ధ అటవీ ఉత్పత్తుల సేకరణకు అడవిలోనికి పోయే గిరిజనులపై అక్రమ కేసులు బనాయించి జైలుపాలు చేస్తున్నారని విమర్శించారు. రోజురోజుకీ గిరిజనులపై అటవీశాఖ అధికారుల దాడులు పెరిగిపోతున్నాయన్నారు. గిరిజనులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. డిహెచ్పిఎస్ నియోజకవర్గ కార్యదర్శి మోడి శివయ్య, ఏపీఎండిసి ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పోకూరు మురళి, సిపిఐ మండల కార్యదర్శులు దార్ల రాజశేఖర్(కోడూరు), సి నాగమ్మ(ఓబులవారిపల్లి),నాగేశ్వరరావు, మహిళా మండలి సమాఖ్య కార్యదర్శి వి.నరసమ్మ, సిపిఐ కార్యకర్తలు జ్యోతి రఘురామయ్య కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేడు కల్పనాయిని చెరువు రాచపల్లిలో జగనన్న సురక్ష

విశాలాంధ్ర - రామాపురం : మండలంలోని కల్పనాల చెరువు రాచపల్లిలో పంచాయతీలోని గ్రామ సచివాలయంలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతుందని తాసిల్దార్ అరవింద్ కిషోర్ ఎంపీడీవో హైదరవల్లి అన్నారు.ఈ కార్యక్రమాన్ని ప్రజలు అర్హులు అందరూ చదివేన చేసుకోవాలని వారు తెలిపారు.

సంపద వనరుల కేంద్రాన్ని సందర్శించిన ఈవోపీఆర్డి

విశాలాంధ్ర-రామాపురం: మండలంలోని గువ్వల చెరువు గ్రామపంచాయతీ సంపద వనరుల కేంద్రాన్ని గ్రామ సచివాలయాన్ని శుక్రవారం ఈవోపీఆర్డి ఉషారాణి ఆకస్మికంగా సందర్శించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలో ఉన్న చెత్తాచెదారాలన్నీ గ్రీన్ అంబాసిడర్లకు తరలిస్తే వారు తడి చెత్త, పొడి చెత్త ను వేరు వేరు చేసి సంపద వనరుల కేంద్రంలోకి చేర్చాలన్నారు. ఇందులో వానపాముల తయారీ, ద్వారా పంట పొలాలకు మంచి ఎరువులు తయారు చేసుకోవచ్చని ఆమె తెలిపారు. ఇందుకోసం ఆ గ్రామం లోని ప్రజలు అంతా గ్రీన్ అంబాసిడర్ లకు సహకరించాలన్నారు. ఈమె వెంట సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నర్సరీలకు లైసెన్స్ తప్పనిసరి

విశాలాంధ్ర-గాలివీడు: నర్సరీ యజమానులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకుని లైసెన్సులు పొందాలని ఉద్యాన శాఖ అధికారిణి టి.నాగమణి పేర్కొన్నారు.శుక్రవారం గాలివీడు మండలకేంద్రంలో వున్న నర్సరీలను తనిఖీ చేశారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ లైసెన్సులు వున్న నర్సరీ యజమానులు మాత్రమే నారు అమ్మలన్నారు.అంతేగాక విత్తన స్టాక్ రిజిస్టర్,నారు అమ్మకాల రిజిస్టర్,సస్యరక్షణ రిజిస్టర్,నర్సరీ తనిఖీ చేయు అధికారి రిజిస్టర్ లను సిద్ధంగా వుంచాలని సూచించారు. రైతులకు నాణ్య మైన నారు ఇవ్వాలని,నారుకు సంభందించిన రశీదును కూడా ఇవ్వాలని తెలిపారు.ఆమె వెంట ఉద్యానశాఖ సిబ్బంది మల్లిక, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు మంచి సలహాలు ఇవ్వండి : ఎంపీపీ

విశాలాంధ్ర -వీరబల్లి : రైతులకు సరైన సమయంలో సరైన సలహాలు ఇస్తే రైతులు మంచి ఆదాయం పొందుతారని ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. శుక్రవరం వీరబల్లె మండల వ్యవసాయ సలహా మండలి సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రైతులకు సరైన అవగాహన లేకనే రైతుల నష్టాలు పాలవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లి ఏడి జయారాని, వీరబల్లె ఏఓ స్వాతి, ఏపిఓ ఖాదర్ వలీ, ఆర్‌బికే అసిస్టెంట్స్, తాటిగుంట్లపల్లి సర్పంచ్ గోపీనాథ్ రెడ్డి, రవికుమార్ రెడ్డి, మణిరాజు, శ్రీరాములు రెడ్డి, రామకృష్ణారెడ్డి, వెంకట్రాం రెడ్డి, చలపతి నాయుడు, మోహన్ రాజు మొదలైన వారు పాల్గొన్నారు.

భూ కబ్జాపై ఆగ్రహించిన దళితులు

పాటూరులో కబ్జాలకు అతడొక కేరాఫ్

విశాలాంధ్ర-నందలూరు :: మండలంలోని పాటూరు పంచాయితీ ఎర్రిపాపయ్యగారి పల్లె దళితవాడ నందు శుక్రవారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. 1979 వ సంవత్సరంలో కాంగ్రెస్ హయాంలోని దళితులకు యిచ్చిన ఇంటి పట్టా స్థలాలను అదే గ్రామానికి చెందిన చెంగల్ రెడ్డి అనే వ్యక్తి అక్రమంగా జెసిబితో చదును చేయడంతో దళితులు నిలదీసి అడ్డుకోవడం జరిగింది. ప్రభుత్వం యిచ్చిన పంట భూములలో పట్టా స్థలాల్లో కాసుల గుట్ట ఆలయంకు దళితులు దారి కోసం స్థలాలు యివ్వడం జరిగింది కాని చెంగల్ రెడ్డి ఆ దారితో పాటు తమ ఇంటి పట్టాలను ఆక్రమించే ప్రయత్నాలు చేస్తున్నారని వారు ఆరోపించారు. చెంగల్ రెడ్డి కబ్జాల నుంచి కాపాడి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పాటూరులో ఎక్కడ చూసినా అతను కబ్జాలకు పాల్పడుతూ కేరాఫ్‌గా నిలుస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు నచ్చజెప్పడంతో గొడవ సర్దుమనిగింది. అనంతరం చెంగల్ రెడ్డిపై నందలూరు పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేయడం జరిగింది. గతంలో చెంగల్ రెడ్డి పలు భూములను ఆక్రమణ చేసి ఫెన్సింగ్ వేసినా ఇప్పటి వరకు రెవెన్యూ అధికారులు తొలగించకపోవడం, ఇపుడు మరొక కబ్జాకు పాల్పడడంతో రెవెన్యూ అధికారులపై గ్రామ ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తపరుస్తున్నారు. ఇంత దారుణం జరుగుతున్నా రెవెన్యూ అధికారులు సంఘటనా స్థలానికి రాకపోవడం దారుణమని, ఇప్పటికైనా చెంగల్ రెడ్డి చేస్తున్న కబ్జాలను అడ్డుకొని న్యాయం చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

మిద్దె పైనుంచి కిందపడి మహిళకు తీవ్ర గాయాలు

విశాలాంధ్ర-లక్కిరెడ్డిపల్లి : కూలి పనులకు వెళ్లి మిద్దె పనులు చేస్తుండగా మిద్దెపైనుంచి ప్రమాశాత్తు శుక్రవారం మిద్దె పైనుంచి కిందపడి రజిని (25) అనే మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. రజిని కుటుంబీకులు నెలరోజుల క్రితం గుర్రంకొండ మండలం ఖమ్మం గారి పల్లె నుంచి లకిరెడ్డిపల్లికి చేరుకొని బేల్దారి పనులు చేస్తూ జీవనం సాగించేవారు. బ్రతుకుదెరువు కోసం వచ్చిన రజనీకి మిద్దె పైన పనులు చేస్తూ ఉండగా పైనుంచి ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడిందని స్థానికులు బంధువులు తెలిపారు. ఈ మేరకు వెంటనే స్థానికులు బంధువులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కడప రిమ్స్‌కు తరలించినట్లు బంధువులు తెలిపారు.

వీరభద్రాలయంలో రాహుకాల పూజలు

విశాలాంధ్ర-రాయచోటిటౌన్:శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి దేవస్థానం యందు స్థానిక భక్తులు రాహుకాల దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. వచ్చిన భక్తులకు శంకరయ్య స్వామి తీర్థ ప్రసాదాలు అందజేసారు అని ఆలయ చైర్మన్ పోలంరెడ్డి విజయమ్మ,చ ఆలయ ఇఓ డి.వి.రమణారెడ్డి తెలియజేసారు.

సుబ్రమణ్యం మృతి పార్టీకి తీరని లోటు: సిపిఐ

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : పుల్లంపేట మండల సిపిఐ సీనియర్ నాయకులు ఎర్రతోట సుబ్రమణ్యం ఆకస్మిక మృతి భారత కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటని సిపిఐ అన్నమయ్య జిల్లా కార్యదర్శి పిఎల్ నరసింహులు పేర్కొన్నారు. బుధవారం మృతుని స్వగ్రామానికి వెళ్లి పార్థివ దేహంపై సిపిఐ ఎర్రజెండా కప్పి పూలమాలవేసి జోహార్ అంటూ నివాళులు అర్పించారు. మృతికి సంతాపం వారి కుటుంబానికి సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుబ్రమణ్యం మృతి బాధాకరం అని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ కుటుంబానికి సిపిఐ పార్టీ అండగా ఉంటుంది అధైర్యపడవద్దు అని భరోసా ఇచ్చారు. ఎపి అంగన్‌వాడి వర్కర్స్ యూనియన్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నంద్యాల సరోజమ్మ, విశాలాంధ్ర నియోజకవర్గ ఇన్చార్జి వంకర సుబ్రమణ్యం, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య, ఎఐటియుసి ఎరియా కార్యదర్శి మాదరాజు గంగాధర్, బికెఎంయు నియోజకవర్గ కార్యదర్శి కేశం ప్రసాద్, సిపిఐ మండల కార్యదర్శులు దార్ల రాజశేఖర్ (కోడూరు), సెల్వం కుమార్ (పుల్లంపేట), సిపిఐ ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

బీజేపీ మండల సమావేశం

విశాలాంధ్ర-సుండుపల్లె : బీజేపీ మండల సమావేశం మండల అధ్యక్షుడు రాచరాయుడు ఆద్వర్యంలో జరిగినది. ఈ కార్యక్రమం ముఖ్య అతిథిగా రాజంపేట అసెంబ్లీ కన్వీనర్ రామ జగదీష్ స్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దగ్గుపాటి పురందేశ్వరి రాష్ట్ర అధ్యక్షురాలు బాధ్యతలు స్వీకరించిన మరుక్షణం రాష్ట్ర ప్రభుత్వం చేసే అరాచకాలను ఎండగట్టడం జరిగింది. అలాగే రాష్ట్రంలో శాంతి భద్రతలు విషయంలో విఫలమైదన్నారు. స్వర్ణాంధ్రను విధ్వంసాంధ్రాగా మార్చారని, రానున్న కాలంలో స్వర్ణ ఆంధ్ర ప్రదేశ్ తీర్చిదిద్దడం ఒక భారతీయ జనతా పార్టీ కే సాధ్యం అని తెలిపారు. దీనిని రాజంపేట అసెంబ్లీ కార్యకర్తలు స్వాగతిస్తున్నారు. అలాగే ఈ సమావేశంలో సుండుపల్లి మండలంలో రాజంపేటలో జరిగే అరాచకాలను, ఇసుక,మట్టి మాఫియా,భు ఆక్రమణలు, వారి దృష్టికి తీసుకు వెళ్లలాని తీర్మానం చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ సుబ్బరాజు, వెంకట్రామ రాజు, ఎస్సీ మోర్చా అధ్యక్షులు, అసోక్, కిసాన్ మోర్చా అధ్యక్షులు సుబ్బరామ రాజు, ఓబీసీ అధ్యక్షులు శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి మునయ్య, సీనియర్ నాయకులు, గోపాల్రాజు, సత్యం నాయుడు, ఉపాధ్యక్షులు, రెడ్డయ్యాచారి, నాగరాజు, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

బిఎస్ రావుకు ఘన నివాళి

విశాలాంధ్ర-మదనపల్లి: శ్రీ చైతన్య వ్యవస్థాపకులు బి.ఎస్.రావుకు చైతన్య మదనపల్లి పాఠశాలలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా జిఎం సురేష్ మాట్లాడుతూ ఆయన సంకల్పంతోనే నేడు అనేకమందికి ఉపాధి దొరికిందని విద్యార్థులకు విద్యా జ్ఞానాన్ని పంపించే విధంగా మహోన్నత వ్యక్తిని వారి సేవలు చిరస్మరణీయమని తెలిపారు ఈ కార్యక్రమంలో అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

టిడిపికి పూర్వ వైభవమే తమ లక్ష్యం

విశాలాంధ్ర-గుర్రంకొండ: టిడిపి పార్టీని అహర్నిశలు కృషిచేసి పూర్వ వైభవం తీసుకురావడమే తమ లక్ష్యమని టిడిపి మండల అధ్యక్షుడు నాయని జగదీష్ శుక్రవారం నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి తో చర్చించారు ఈ సందర్భంగా కిషోర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ టిడిపి చేపట్టిన భవిష్యత్తుకు గ్యారెంటీ జన చైతన్య యాత్ర విజయవంతం చేసిన గుర్రంకొండ ప్రజలకు అభినందనలు తెలిపారు రాబోయే రోజులలో నాయకులు కార్యకర్తలు మరింత కష్టపడి పార్టీని విజయ దశలో నడిపించాలని కోరారు

ఎస్సీ ఎస్టీ కేసును దర్యాప్తు చేపట్టిన డిఎస్పి

విశాలాంధ్ర-పీలేరు:-స్థానిక మండలంలోని బోడుమల్ల వారి పల్లి హరిజనవాడలో ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు కు సంబంధించి మదనపల్లి డి.ఎస్.పి సుధాకర్ విచారణ చేపట్టారు. ఇటీవల బోడుమల్లువారి పల్లి హరిజనవాడకు సమీపంలోని పొలంలో బోడుమల్లవారిపల్లి గ్రామ నివాసులు అయిన కురబలస్తులు(బి.సి లు) బోడుమల్లువారి పల్లి హరిజనవాడకు చెందిన ఆర్.సత్యనారాయణ పై రాళ్ల దాడి చేసి తలపైన రక్త గాయాలు చేశారు. ఆర్. సత్యనారాయణ ఫిర్యాదు మేరకు ఎస్సై నరసింహుడు ప్రాథమికంగా విచారించి శివ, ఆదినారాయణ, మహేంద్ర అనే వ్యక్తులపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేశారు. పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు కు సంబంధించి మదనపల్లి డిఎస్పి సుధాకర్ శనివారం విచారణ నిమిత్తం బొడుమల్లువారిపల్లి హరిజనవాడ సమీపంలోని సంఘటన స్థలంలో విచారణ చేపట్టారు. విచారణలో భాగంగా ఫిర్యాదుదారులను, సాక్షులను విచారించి రికార్డు చేశారు. పై కార్యక్రమంలో మదనపల్లి డిఎస్పి సుధాకర్ తో పాటు పీలేరు ఎస్ఐ నరసింహుడు, పోలీసు సిబ్బంది, గ్రామస్తులు, ఎమ్మార్పీఎస్, మాల మహానాడు తదితర కుల సంఘ నాయకులు పాల్గొన్నారు పాల్గొన్నారు.

ఫోటో రైటప్ :- మదనపల్లి డి.ఎస్.పి సుధాకర్ (14పీలేరు 6)

విశాలాంధ్ర
విలేకరులు కావలెను
విశాలాంధ్ర అన్నమయ్య జిల్లాలో దిగువ పేర్కొన్న మండలాలలో పనిచేయుటకు విలేకరులు కావలెను. ఇంటర్మీడియట్ పాస్. తెలుగు భాషా పరిజ్ఞానం కలిగిన వ్యక్తులు అర్హులు.
పనిచేయవలసిన మండలాలు : చిన్నమండ్యం, సంబేపల్లి, పెనగలూరు, చిట్వేల్, పుల్లంపేట, ఓబులవారిపల్లి, కురబలకోట, తంబళ్లపల్లి, పిటిఎం, మొలకలచెరువు, బి. కొత్తకోట, నిమ్మనపల్లి, కలికిరి, వాల్మీకిపురం, కలకడ, కె.వి.పల్లి, మదనపల్లి టౌన్, పెద్దమండ్యం.
వ్రాత పరీక్ష తేది: 17-7-2023 , సమయం : ఉ॥ 10.30 గంటలకు
స్థలం : ఎన్‌జిఓ హోమ్. ఆర్టీసి బస్టాండ్ ఎదురుగా. రాయచోటి.
వివరాలకు: 99855 89444

చేనేత హస్త కళలను ఆదరించండి
డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : శ్రీ కళాజ్యోతి హాండ్ క్రాఫ్ట్ వెల్ఫేర్ సొసైటీ వారి హస్తకళ, చేనేత ప్రదర్శన అమ్మకాలను ప్రజలు ఆదరించాలని డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి కోరారు. శుక్రవారం మద్రాస్ రోడ్ లోని టీటీడీ కల్యాణ మండపంలో ప్రదర్శన అమ్మకాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రఖ్యాత చేనేత వస్త్రాలు, డ్రస్ మెటీరియల్, బెడ్ షీట్స్, హస్త కళా వస్తువులు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. ఈనెల 30వ తేదీ వరకు ప్రదర్శనలు అమ్మకాలు ఉంటాయని తెలిపారు. అనంతరం సొసైటీ సెక్రటరీ వెంకయ్య మాట్లాడుతూ ఈనెల 14వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ప్రదర్శన అమ్మకాలను కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు అమ్మకాలు ఉంటాయని తెలిపారు. హైదరాబాద్ బ్లాక్ ప్రింటింగ్ శారీస్, బెంగాలీ కాటన్, మంగళగిరి నారాయణపేట, ధర్మవరం, పోచంపల్లి, మధ్యప్రదేశ్, టస్కర్, భాగలాపురి సిల్క్ చీరలు, లక్నో చికెన్ చీరలు ప్రదర్శనలో ఉన్నాయని చెప్పారు. డ్రెస్ మెటీరియల్ కలంకారి, మంగళగిరి, చీరాల, పోచంపల్లి, నారాయణపేట, నారాయణ వనం మొదలైనవి అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

మహాశక్తి ప్రారంభంలో పాల్గొన్న టీడీపీమహిళా నేత ఉమా దేవి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : తెలుగు దేశం పార్టీ మహిళా చైతన్యం కోసం తలపెట్టిన ప్రతిష్టాత్మక కార్యక్రమం మహాశక్తి ప్రారంభానికి కడప తెలుగుదేశం పార్టీ మహిళా నేత,కార్పొరేటర్ ఉమాదేవి హాజరయ్యారు. విజయవాడలోని పార్టీ ఆఫీసులో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం మహిళా శక్తి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మహిళ నేతలు హాజరయ్యారు. మహిళా చైతన్యం కోసం మహిళా శక్తి కార్యక్రమం ద్వారా 41 రోజులు పాటు దీక్షగా కార్యక్రమాలు చేపడతారు. విజయదశమి రోజుకు 41 రోజుల ఈ కార్యక్రమం పూర్తిచేసి ఆ రోజు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమానికి సంబంధించిన సభలు, సమావేశాలు నిర్వహిస్తారు. తెలుగుదేశం పార్టీ మహిళల కోసం చేపట్టిన కార్యక్రమాలు, చేయబోయే కార్యక్రమాలు, వైసీపీలో మహిళలకు జరుగుతున్న అన్యాయాలు వీటి పై దీక్షలా 41 రోజులు పాటు మహిళా శక్తి కార్యక్రమాన్ని చేపడతారు. ఇందులో భాగంగా కడప అసెంబ్లీలో ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టి మహిళల్లో చైతన్యాన్ని తీసుకొచ్చేందుకు మహిళా నేత,కడప అభ్యర్థి బరిలో ఉన్న జి.ఉమాదేవి, ఆమె కుటుంబ సభ్యులు సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు మోహన్ రెడ్డి, జెడ్పి మాజీ వైస్ చైర్మన్ లక్ష్మిరెడ్డిలు కార్యచరణ రూపొందించుకుంటున్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

విశాలాంధ్ర-సిద్దవటం : గ్రామంలోని ప్రజలు దోమలు వృద్ధి చెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మలేరియా సబ్ యూనిట్ మలేరియా అధికారి ఇండ్ల సుబ్బరాయుడు తెలిపారు. మండల కేంద్రంలోని సిద్దవటం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డెంగ్యూ నివారణ మాసోత్సవాలు భాగంగా శుక్రవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసర ప్రాంతాల్లో చెత్తాచెదారం లేకుండా చూసుకోవాలని, మురికి నీరు నిలువ లేకుండా మరియు కుళాయిల లీకేజీ లేకుండా చూసుకోవాలని నేను నిల్వ ఉన్నచో దోమలు ఉత్పత్తి చెందుతాయని మలేరియా సబ్ యూనిట్ అధికారి ఇండ్ల సుబ్బరాయుడు విద్యార్థులకు, విద్యార్థినిలకు, అవగాహన తెలియజేశారు. దోమలుకుట్టడం వల్ల, మలేరియా చికెన్ గున్యా డెంగ్యూ వ్యాధి, మెదడువాపు బోదకాలు వంటి వ్యాధులు వస్తాయని తెలియజేశారు ఇంటి పరిసర ప్రాంతాల్లో పనికిరాని,పడవేసిన, తొట్లు, డబ్బాలు టైర్లు, కొబ్బరి చిప్పలు, మొదలగు వాటిలో వర్షపు నీరు నిల్వ ఉండి లార్వా ఉత్పత్తి చెందుతుందని అలాంటి వస్తువులను ఇంటికి దూరంగా పడేయాలని సూచించారు రాత్రిపూట ప్రతి ఒక్కరూనిండు దుస్తులు వాడాలని,రాత్రిపూట దోమల నివారణకై వేప పొగ వేసుకోవాలని తలుపులు మూసేయాలని దీనివల్ల దోమల అరికట్ట వచ్చు అని విద్యార్థులకు మలేరియా సబ్ యూనిట్ అధికారి ఇండ్ల సుబ్బరాయుడు తెలియజేశారు విద్యార్థులచే మానవ హారం నిర్వహించి అవగాహన తెలిపారు జంగాలపల్లి గ్రామపంచాయతీ కమ్మ పాలెం లో ఇంటింటికి వెళ్లి పరిసరాలను పరిశీలించి వారికి దోమల వలన వచ్చే జ్వరాలపై తెలియజేసి నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని గ్రామ ప్రజలకు తెలియజేశారు నీరు విలువ ఉన్నచోట అబిట్ పిచికారి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లోకేశ్వరిసీనియర్ ఆరోగ్య కార్యకర్త, లక్ష్మమ్మ, జిల్లా పరిషత్ హై స్కూల్ హెడ్మాస్టర్ శ్రీరాములు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష ద్వారా 11 రకాల సేవలు ఉచితం

విశాలాంధ్ర-సిద్దవటం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పేదవాడికి నిజమైన అర్హులకు న్యాయం జరిగే విధంగా 11 రకాల సేవలను ఉచితంగా అందిచడమే జగనన్న సురక్ష అని ఎంపీడీఓ జవహర్ బాబు తెలిపారు. మండలంలోని జ్యోతి గ్రామ సచివాలయంలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యాక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి వాలంటరీ వ్యవస్థ పెట్టి ఇంటింటికి వెళ్ళి వాలంటీర్లు ప్రజల సమస్యలను తెలుసుకొని రెండు మూడు రోజుల్లోనే కుల, ఆదాయ, ముటేషన్, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, జనన, మరణ, వివాహ పత్రాలతో పాటుగా మరికొన్ని సర్టిఫికెట్ల సమస్యలను పరిష్కరించడం జరిగిందన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో నిజమైన లబ్ధిదారులకు న్యాయం జరిగే విధంగా అమలు చేయడం చాలా గొప్ప విశేషమన్నారు. తహసీల్దారు లక్ష్మీదేవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన జగనన్న సురక్ష ప్రతి ఒక్కరికి ఎంతో ఉపయోగపడుతుందని అర్హులైన వారికి 11 రకాల సేవలను అందించడం జరుగుతుందన్నారు. అనంతరం లబ్ధిదారులకు, కుల, ఆధాయ, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లను ఎంపీపీ వెంకటమ్మ, సర్పంచ్ సుబ్బమ్మ, ఎంపీడీఓ జవహర్ బాబు, తహసీల్దారు లక్ష్మీదేవిలు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ బి. పులిరామ్ సింగ్, ఏపిఎం వెంకటేష్, హౌసింగ్ ఇన్చార్జి ఏఈ చెన్నయ్య, ఆర్ఎస్ఐ అనురాధ, ఐసీడీఎస్ సూపర్వైజర్ నాగరత్న, పంచాయతీ కార్యదర్శులు ఎ. విజయ్ కుమార్, కె. వరప్రసాదావు. విఆర్వో శాంబాబు, లబ్దిదారులు,పాల్గొన్నారు.

అభివృద్ధిలో రాయచోటి పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం: ఎమ్మెల్యే

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: అభివృద్ధిలో రాయచోటి పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నామని వైఎస్ఆర్ సిపి రాయచోటి అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎంఎల్ఏ శ్రీకాంత్ రెడ్డి అన్నారు.శుక్రవారం రాయచోటి మున్సిపాలిటీ కొత్తపేట 20,21 వార్డులలో నిర్వహించిన గడప గడప కు మన ప్రభుత్వంలో శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. కొత్తపేట లోని వీధులలో ఉదయం 6 గంటలకే మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష, సివిల్ సప్లైస్ డైరెక్టర్ పోలు సుబ్బారెడ్డి,వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహమాన్, నాయకులు జయరామి రెడ్డి,మహేష్ రెడ్డి తదితర నాయకులు,అధికారుల బృందంతో కలసి శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.డిష్ రెడ్డెన్న వీధి,సాయిరాం వీధి,నెహ్రూ నగర్,టెంకాయచెట్ల వీధి,గాంధీ నగర్, నేషనల్ హైస్కూల్ వీధి,ప్రశాంత్ నగర్ లలో శ్రీకాంత్ రెడ్డి గడప గడప ను సందర్శించారు. ప్రభుత్వ పథకాలు అందుతున్న వారిని,ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారులు, పథకాలు అందని వారితో ఆప్యాయత, ప్రేమానురాగాలుతో ప్రజలను పలకరిస్తూ, సమస్యల పరిష్కారంపై బిడ్డలా, సోదరునిలా చొరవచూపుతూ ప్రతి గడప ను శ్రీకాంత్ రెడ్డి సందర్శించారు. కొత్తపేట అభివృద్ధికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామన్నారు. పారిశుద్ధ్యం మరింత మెరుగునకు కృషి చేస్తున్నామని శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. జిల్లా ఏర్పాటుతో పట్టణ అభివృద్ధితో పాటు యువతకు ఉపాధి అవకాశాలు: రాయచోటి జిల్లా కేంద్రం కావడంతో పట్టణం అభివృద్ధి చెందడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కలుగుచున్నాయంటూ ఎంఎల్ఏ శ్రీకాంత్ రెడ్డి కి కొత్తపేట ప్రజలు యువత హర్షం వ్యక్తం చేసింది. జిల్లా కేంద్రం ఏర్పాటులో మీ కృషి అభినందనీయమంటూ శ్రీకాంత్ రెడ్డిని ప్రశంసించారు. నూతన జిల్లా ఏర్పాటుతో హోటల్స్, ఇతర వ్యాపార అభివృద్ధి, విద్యా సంస్థల ఏర్పాటు, పరిశ్రమల ఏర్పాటుతో నిరుద్యోగ యువతకు ఎంతో ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయన్నారు.మీ కృషితో నియోజక వర్గంలో రానున్న రోజుల్లో కృష్ణా జలాల పారుదలతో వ్యవసాయం పండుగలా మారుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. పట్టణంలో వంద పడకల ఆసుపత్రి, భూగర్భ డ్రైనేజీ, రహదారుల విస్తరణ,అదనపు నీటి పథకాల నిర్మాణం, రైతు బజార్, పట్టణ ఆరోగ్య కేంద్రాలు,ఆర్ టి సి బస్ స్టాండ్ విస్తరణ, పట్టణ సుందరీకరణ, డైట్ హాస్టల్ ప్రాంగణంలో పార్క్ నిర్మాణపు పనులు, తదితర అభివృద్ధి పనులు కళ్ళకు కట్టినట్లుగా కనపడుచున్నా యంటూ ప్రజలు, యువత ఎంఎల్ఏ శ్రీకాంత్ రెడ్డి ఎదుట ఆనందం వ్యక్తం చేశారు.జగన్ ప్రభుత్వంలో అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి మూడో,నాలుగో పథకాలు అందాయని, జగనన్న పాలన భేషుగ్గా ఉందని, జగన్ పాలనకు వందశాతం మార్కులు వేస్తున్నామంటూ ఎంఎల్ఏ శ్రీకాంత్ రెడ్డి కి కొత్తపేట ప్రజలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల బిసి నాయకుడు పల్లపు రమేష్,కౌన్సిలర్లు కసిరెడ్డి వెంకట నరసింహా రెడ్డి, సుగవాసి ఈశ్వర్ ప్రసాద్,కొలిమి ఛాన్ బాష, సుగవాసి శ్యామ్, జానం రవీంద్ర యాదవ్,షబ్బీర్,పల్లా రమేష్, మురికినాటి వెంకట్రామిరెడ్డి, అమరనాధ రెడ్డి, అనీల్ రెడ్డి, గంగిరెడ్డి, విల్వపతి రెడ్డి,మాధవరం రమేష్ రెడ్డి,డీలర్ నాగేంద్ర, జిల్లా వ్యవసాయ సలహా సంఘ సభ్యుడు దిన్నెపాడు రవిరాజు, మానవత యర్రపురెడ్డి బ్రహ్మానంద రెడ్డి,లక్ష్మీకర్ రెడ్డి,షిరిడీ సాయి మహిళా కళాశాల డైరెక్టర్ మనోజ్ రెడ్డి,శంకర్ రెడ్డి,నాగిరెడ్డి, నరేష్,కో ఆప్షన్ హజరత్ ఖాదర్ వలీ,పాదలపల్లె గోపాల్ రెడ్డి,బదిమేనల నరసింహులు పాల్గొన్నారు.

జిల్లాలో పశుగ్రాసాభివృద్ధికి కృషి చేయాలి

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: జిల్లాలో పశుగ్రాసాభివృద్ధికి కృషి చేయాలని జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డా.కె. గుణశేఖర పిళ్లై అన్నమయ్య జిల్లా రైతు లను కోరారు. శుక్రవారం ఉదయం అన్నమయ్య జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి కార్యాలయము నందు పశుగ్రాస వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి ఆధ్వర్యంలో ఒక రోజు అవగాహన కార్యక్రమము నిర్వహిం చారు. ఈ సదర్భంగా కార్యక్రమములో పాల్గొన్న రైతుల నుద్దేశించి ఆయన ప్రసంగి స్తూ... వివిధ రకాల పశుగ్రాసాలు, వాటి పాడి పద్ధతులు మరియు నిల్వ చేయు పద్ధతులు, వాటి పోషక విలువలు, ప్రాముఖ్యత వివరాలను తెలియజేశారు. పశుగ్రాసాభివృద్ధికి పశుసంవర్ధక శాఖ అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను వివరిం చారు. ఈ సందర్భముగా వివిధ అంశాలలో రైతులు వెలిబుచ్చిన సందేహాలను నివృ త్తి చేశారు. ఈ కార్యక్రమములో ఉప సంచాలకులు శ్రీనివాసులు నాయుడు, అసిస్టెం ట్ డైరక్టర్లు డా. యస్.వి.శివారెడ్డి, డా.టి. శ్రీధర్రెడ్డి, డా.లోకేష్, పశువైద్య సహాయ శస్త్ర చికిత్సకులు డా. ఎన్.రవికుమార్, రైతులు, సిబ్బంది తదితరులుపాల్గొన్నారు.

వాలెంటీర్లకు రూ.15వేలు వేతనం ఇవ్వాలి

విశాలాంధ్ర-పీలేరు: అయ్యా... సీఎం.జగన్ వాలీంటర్ల కు జీతం రూ.15 వేలు ఇవ్వు...నా పూర్తి వాలంటీర్ వ్యవస్థకు నా మద్దతు ప్రకటిస్తానని పీలేరు నియోజకవర్గం జనసేన అధ్యక్షులు బెజవాడ దినేష్ రెడ్డి సంచలన వ్యాఖ్య చేశారు. శుక్రవారం స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ చిత్రపటానికి జనసేన నాయకులు,జనసైనికులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా దినేష్ రెడ్డి మాటలాడుతు వాలంటీర్లకు దమ్ము, ధైర్యం వుంటే జీతం రూ.15 వేలు ఇవ్వాలంటూ ప్రభుత్వంపై పోరాటం చేయండి. నేను మద్దతిస్తాను అన్నారు. తమ నేత పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలకు వైసీపీ వక్రీకరించి రాద్ధాం చేయడం హాస్యాపదం అని అన్నారు. అంతేగాని వైసీపీ చౌకబారు రాజకీయాలు మానుకోవాలని అన్నారు. రాష్ట్రమంతట జనసేనకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని పేర్కొన్నారు.

కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వే తనిఖీ

విశాలాంధ్ర-పీలేరు: అన్నమయ్య జిల్లా పారామెడికల్ అధికారి రవికుమార్ నాయక్ గర్నిమిట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమానికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. తదనంతరం వైద్యురాలు డాక్టర్ రేష్మ మరియు పర్యవేక్షక సిబ్బందితో కలసి కుష్టు వ్యాది గ్రస్తులను గుర్తించేందుకై జరుగుతున్న "లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్" కార్యక్రమాన్ని గర్నిమిట్ట మరియు కంభం వారి పల్లె గ్రామాల లో తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ కుష్టు వ్యాధి అనుమానితులను గుర్తించడంలో ఆశా కార్యకర్తల పాత్ర చాలా కీలకమని, వారి పరిధిలోని అన్ని గృహాలను సందర్శించి ప్రతి వ్యక్తిని పరిశీలించాలని సూచించారు. వ్యాధి లక్షణాలు కలవారిని గుర్తించి, వైద్యాధికారి వద్దకు రెఫర్ చేయాలన్నారు. చికిత్స పొందని వ్యాధిగ్రస్తుల ద్వారా సమాజంలో మరింత మందికి వ్యాధి వ్యాపించే అవకాశం ఉన్నందున క్షుణ్ణంగా పరిశీలన చేసి అనుమానితులను గుర్తించాలన్నారు. కుష్టు వ్యాధిపై గల అపోహలు, భయాలను తొలగించాలన్నారు. ఉచిత చికిత్స ఉన్నదనే విషయాన్ని అందరికీ అవగాహన కల్పించాలని, సర్వే నివేదికలలో పూర్తి వివరాలను నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారిణి భాగ్యలక్ష్మి, ఆరోగ్య విస్తరణ అధికారి కృష్ణయ్య, నోడల్ పర్సన్ పురుషోత్తం, పర్యవేక్షకురాలు రుక్మిణి, ఫార్మసిస్టు రమణి, ఆరోగ్య కార్యకర్త సరస్వతి, ఆషా కార్యకర్తలు యర్రమ్మ, రెడ్డిలక్షీ పాల్గొన్నారు.

వాలంటీర్ల వ్యవస్థపై ఎందుకింత ద్వేషం

విశాలాంధ్ర-పీలేరు: వాలంటీరు-ప్రతీ ఇంటికి ఆత్మీయ అతిధి, వాలంటీర్ల వ్యవస్థపై ఎందుకింత ద్వేషం..ఉక్రోశం,నాడు జన్మభూమి కమిటీల్లో ఈ ఆప్యాయత..ఆదరణ ఉందాఅని పీలేరు ఎంపీపీ కంభం సతీష్ కుమార్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ కంభం సతీష్ కుమార్ రెడ్డి మాటలాడుతుకరోనావచ్చినా,తుఫాను వచ్చినా అధికారుల కంటే ముందు అండగా నిలిచింది వాలంటీర్లే నని అన్నారు.ఈ వాలంటీర్లు లేకపోతే కదలలేని అవ్వాతాతలకు పెన్షన్ ఇచ్చేదెవరని అన్నారు. ఇంటింటి తెల్లవారు జామునే వెళ్లి అధికారులు ప్రతీ ఒక్కరికి ఇవ్వటం సాధ్యమేనా,ఏపీలో ప్రతీ ఇంటితోనూ వాలంటీర్లకు అవినాభావ సంబంధం ఏర్పడింది. దీనిని తుంచటం సాధ్యపడేనా అని ఆయనఅన్నారు.వాలంటీర్లు వైసీపీ కార్యకర్తలు అంటూ రాజకీయ ముద్ర వేస్తున్నారు. అదే వాలంటీర్లు టీడీపీ, జనసేన మద్దతుదారులకు సేవలందిస్తున్నారు. అది గుర్తించారాప్రభుత్వం వారిని నమ్మకమైన ప్రజా సేవకులుగా గుర్తించింది.రాజకీయ పార్టీలు వారిని రాజకీయ కార్యకర్తలుగా ముద్ర వేస్తున్నారు.ఆపదలో ఉండి అందుబాటులో లేని వారి లబ్ది దారులకు వారున్న చోటకు వెళ్లి పెన్షన్ అందిస్తున్న నిజమైన సేవకులు వాలంటీర్లు.వాలంటీరు తన పరిధిలోని ప్రతీ ఇంటికి ఆత్మీయ అతిధి.ప్రతీ ఇంటిలోనూ కుటుంబ సభ్యుడిగా బంధం ఏర్పడింది.పెన్షన్ అందుకుంటున్నకదల్లేని అవ్వా తాతల వద్దకు వాలంటీర్ గురించి మాట్లాడండి. వాళ్లు చెబుతారు వాళ్ల సేవలేంటో వాలంటీర్ ను తీసేస్తామని చెప్పే దమ్ము ఈ రాజకీయ నేతలకు ఉందా, ప్రజల్లోకి వచ్చి చెప్పగలరావాలంటీర్లు ఉంది లక్షల్లోనేవారి వెనుక ఉంది కోట్లాది మంది ప్రజలు. వారి అభిమానం.ఏ సర్టిఫికెట్ కావాలన్ని వాలంటీర్ ఉన్నాడనే భరోసా. ఆరోగ్య శ్రీ కార్డు గంటల్లో అందిస్తూ ప్రాణాలు నిలబెడుతున్న నిజమైన సేవకులునాటి జన్మభూమి కమిటీల్లో ఏమైందీ ఈ సేవ. రాజకీయ ప్రయోజనాల కోసం అర్హులకు అండగా ఉన్నవారి పై ఆరోపణలు సమంజమేనాఅని అన్నారు. వాలంటీర్లతో ఇన్ని లాభాలు ఉన్నాయి.ఒక్క నష్టం ఈ ఆరోపణలు చేస్తున్న నేతలు చెప్పగలరాకుటుంబ సభ్యలు వివరాలు వాలంటీర్లు దగ్గర ఉన్నాయనేది ఆరోపణ. ఆ వివరాలు ఉన్న ఫోన్ల నియంత్రణ ఉండేది బాధ్యతా యుతమైన ప్రభుత్వ అధికారుల దగ్గర.వాలంటీర్లను తప్పిస్తే ప్రభుత్వానికి లేదు నష్టం. అసలైన లబ్దిదారులకే కష్టంఅని ఎంపీపీ వ్యాఖ్యనించారు.

ప్రతి ఉద్యోగికి బదిలీ సహజమే

విశాలాంధ్ర-రామాపురం: ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే ప్రతి ఉపాధ్యాయునికి బదిలీలు సహజమేనని ఎంఈఓ రామకృష్ణుడు. ఎంఈఓ 2 జయచంద్ర లు అన్నారు. మండలంలోని నల్లగుట్టపల్లి పంచాయతీ .బి రాచపల్లిలో జిసి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయుడు జి.సి .వెంకటసుబ్బయ్య వీడ్కోలు సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుడు జి.సి.వెంకటసుబ్బయ్య పాఠశాలకు తొలిసారిగా వచ్చినప్పుడు పాఠశాలలో పది మంది మాత్రమే విద్యార్థులు ఉండేదని ఈయన నేను వచ్చాక సుద్ధమల్ల పంచాయతీ దిగువ హరిజనవాడ వెళ్లి పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడి మా పాఠశాలలో పిల్లలు తక్కువ ఉన్నారని తమ పిల్లలు పంపించాలని పిల్లలకు రాను పోను రవాణ ఖర్చులు మేమే పెట్టుకుంటాం అంటూ అక్కడ తల్లిదండ్రులను మోటివేషన్ చేసి నెలకు 5000 రూపాయలు చొప్పున ఆటోకు బాడిగా మాట్లాడుకుని గత నాలుగు సంవత్సరాలుగా ఆయన బాడీ డబ్బులు ఇచ్చారని ఎంఈఓ అన్నారు. ప్రస్తుతం పిల్లలు పాఠశాలలో 25 మంది చేరడంతో ఈ పాఠశాలకు ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నట్లు వారన్నారు. బి రాచపల్లికి చెందిన మల్లిరెడ్డి శ్రీధర్ రెడ్డి పిల్లలకి సంబంధించి రవాణా ఖర్చులకు గాను తాను సొంత ఖర్చులతో ఆటో ఏర్పాటు చేస్తున్నట్లుఆయన తెలిపారు. పాఠశాలలో విద్యాభివృద్ధి కోసం విద్యార్థుల విద్య నైపుణ్యం పెంపొందించినప్పుడే గ్రామంలోని పెద్దలు ఆ ఉపాధ్యాయుని అభినందిస్తానన్నారు. ఈ మధ్యకాలంలో ప్రభుత్వం మనబడి నాడు- నేడు ద్వారా పాఠశాలలకు సంబంధించి అన్ని మౌలిక సదుపాయాలను కల్పించిందన్నారు. అనంతరం బదిలీ అయిన వెంకటసుబ్బయ్య ఆయన సతీమణికి ఎంఈఓలు. ఉపాధ్యాయులు శాలువాలు కప్పి పూలమాలలతో వారిని సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అయోధ్య పురం నాగభూషణ్ రెడ్డి, మల్లి రెడ్డి శ్రీధర్ రెడ్డి, ఉపాధ్యాయులు రామచంద్ర. చంద్రశేఖర్ రెడ్డి. నాగభూషణ్ రెడ్డి. రాజారెడ్డి. శివారెడ్డిజయరాం రెడ్డి. విశ్వనాథ పాల్గొన్నారు.

మండల ప్రజల దాహార్తిని, రైతులకు సాగునీరు అందించండి



విశాలాంధ్ర - సుండుపల్లె : అన్నమయ్య జిల్లా సుండుపల్లె ఝరికోన ప్రాజెక్టు నిండా నీరున్నా, కాల్వలు లేకపోవడంతో భూములన్నీ బీడు వారి,సాగుకు నోచుకోని పరిస్థితి ఝరికోన జలాశయం పరిధిలో నెలకొంది. జలయజ్ఞంలో భాగంగా ఉమ్మడి రాష్ట్రంలో పుష్కరకాలం కిందట అప్పటి ముఖ్యమంత్రి వై. ఎస్.రాజ శేఖరరెడ్డి పాలనలో బాహుదా నదిపై సుండుపల్లి- సంబేపల్లి, కె.వి.పల్లి మండలాల సరిహద్దులో ఝరికోన జలాశయం సుమారు 0.5 టీఎంసీ సామర్థ్యంతో నిర్మించారు.నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కాలువల నిర్మాణం నిమిత్తం శంకుస్థాపనకు ముహూర్తం నిర్ణయించినా, చివరి క్షణంలో ఆర్థిక శాఖ అనుమతి రాలేదని కార్యక్రమం రద్దయింది. ఆ తర్వాత రాష్ట్రం విడిపోవడంతో ఈ ప్రతిపాదన మూలకు చేరింది. విభజనానంతరం రెండు ప్రభుత్వాలు మారినా పంట కాలువల నిర్మాణానికి మోక్షం లభించలేదని సుండుపల్లె మండల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడినోట్లో శని చందంగా ఓ పక్క నీరున్నా భూములకు ఈ పరిస్థితి నెలకొంది. ఎన్నికల సమయంలో పాలకులు మండలానికి వచ్చి పర్యటన సమయంలో గాలి మాటలు చెబుతున్నారే తప్ప కాలువ నిర్మాణం చేసింది లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గత ప్రభుత్వంలో ఈ ప్రభుత్వంలో ఒకే శాసనసభ్యున్ని, పార్లమెంటు సభ్యుని గెలిపించిన ఫలితం లేదని రైతన్నలు వాపోతున్నారు. అయితే ప్రత్యక్షంగా ఐదు వేల ఎకరాల సాగు భూమికి పరోక్షంగా మరో మూడు వేల ఎకరాల సాగు భూమికి నిరందించే సామర్థ్యం జలాశయానికి ఉంది. పాలకులు ఎన్నికల సమయంలో ఓట్ల కోసం మాటలు చెబుతారే తప్ప రైతుల సంక్షేమానికి చేసిందేమీ లేదని పలువురు ఆరోపిస్తున్నారు. సుండుపల్లె మండలంలో గ్రావిటీ పద్ధతిలో రెండు కాలువలు ఏర్పాటు చేసి యర్రమనేని పాలెం, భాగంపల్లి, గుండ్లపల్లి, తిమ్మసముద్రం,సుండుపల్లి, పెద్దినేనికా లువ గ్రామాల పరిధిలో ప్రత్యక్షంగా అయిదు వేల ఎకరాలకు, చెరువులు, కుంటలకు నీరు అనుసంధానం చేయడం ద్వారా పరోక్షంగా మరో రెండవేల ఎకరాల సాగుకు నీరందించాలనేది యోచన. మూడు సంవత్సరాల కిందట సుమారు రూ. వందకోట్ల అంచనాతో పంపిన ప్రతిపాదనలు ఇప్పటికీ ఆమోదానికి నోచుకోలేదు. ప్రజా ప్రతినిధులు దృష్టిసారించి, కాలువల నిర్మాణం చేపట్టేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు.



రైతుల ప్రభుత్వం అంటూ గొప్పలకే పరిమితమైన మాటలు: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రైతుల ప్రభుత్వం అంటూ గొప్పలకే పరిమితమైన మాటలు చెబుతోందని, ఎద్దేవా చేశారు ఎంపీ, ఎమ్మెల్యేలు రైతులకు అండగా ఉంటామని రైతుల సంక్షేమమే ధ్యేయమని ఎన్నికల సమయంలో హామీలు గుప్పించడంలో ఎవరికి వారే సాటి.. సమావేశాల్లో మాట్లాడడానికి తప్ప చేసిందేమీ లేదని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు విశ్వనాథ నాయక్ తెలియజేశారు. జలాశయం నుండి సుండుపల్లి మండలానికి కాలువలు ఏర్పాటు చేసి రైతన్నలను ఆదుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ తరఫున డిమాండ్ చేశారు.

విశ్వనాథ్ నాయక్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు

ప్రతిపాదనల పేరుతో కాలయాపన: ఝరికోన జలాశయం నుండి సుండుపల్లి మండలానికి కాలువలు ఏర్పాటు కలగాని మిగిలిపోయిందని, ప్రతిపాదనల పేరుతో కాలయాపన చేయడం తప్ప కాలువల ఏర్పాటు చేయరా అని జలసంరక్షణ సాధన సమితి కన్వీనర్ విశ్వనాథరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం పైన ఒత్తిడి తీసుకురాలేని పరిస్థితిలో రాజంపేట ప్రజా ప్రతినిధులు ఉన్నారని తెలియజేశారు. కాలువలు ఏర్పాటు అయితే వేల ఎకరాల సాగు భూమి సాగులోకి వస్తుందని తెలియజేశారు. మీరు వృధా కాకుండా చెరువులు కుంటలను నింపవచ్చునని తెలియజేశారు.

విశ్వనాథ్ రెడ్డి, జల సంరక్షణ సాధన సమితి కన్వీనర్

హరిజనవాడ బాధితులకు న్యాయం చేయాలి

విశాలాంధ్ర-పీలేరు: స్థానిక మండలంలోని ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు దర్యాప్తుపై విచారణ నిమిత్తం మదనపల్లి డిఎస్పి సుధాకర్ బోడుమల్లువారిపల్లి హరిజనవాడకు వచ్చిన సందర్భంగా మాల మహానాడు, ఎమ్మార్పీఎస్, డిబిఎస్ఎఫ్ నాయకులు డీఎస్పీ ని కలిసి బోడుమల్లువారిపల్లి హరిజనవాడ వాసులు ఆర్.సత్యనారాయణ పై రాళ్ళ దాడి చేసి తలను గాయపరిచిన సంఘటనపై దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా దళిత నాయకులు మాట్లాడుతూ దళితులపై రోజురోజుకు దాడులు ఎక్కువైతున్నాయని అన్నారు. బొడుమల్లువారిపల్లి హరిజనవాడ దళితులపై గత కొన్ని సంవత్సరాలుగా దాడులు జరుగుతున్నాయని వాపోయారు. సంఘటనలో నిందితులను కఠినంగా శిక్షించి బొడుమల్లువారిపల్లి దళితులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. పై కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తుమ్మల ధరణి కుమార్, ఎమ్మార్పీఎస్ నాయకుడు నగిరిమడుగు సుధాకర్, బాబు, దళిత బహుజన స్టూడెంట్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు బద్దే భాను ప్రకాష్, ద్వారకనాథ్, జి.ఉదయ్ కుమార్, మహేష్, బి.ఆర్ శ్రీనివాసులు, ఈ.శ్రీనివాసులు, చలపతి, బాధితుడు ఆర్.సత్యనారాయణ తల్లి కృష్ణమ్మ, కుమారులు శ్రీధర్, శశిధర్ పాల్గొన్నారు.

బి.ఎస్.రావుకు ఘన నివాళులు

విశాలాంధ్ర-రాజంపేట : శ్రీ చైతన్య విద్యాసంస్థల అధినేత బి.యస్. రావు కు ఆర్ఎస్ రోడ్డు లోని శ్రీ చైతన్య పాఠశాల ప్రిన్సిపల్ ఆకేపాటి సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఘన నివాళులర్పించారు. బి.యస్. రావు గురువారం స్నానపు గదిలో కాలు జారి పడి తుది శ్వాస విడిచారు. ఆయన అకాల మరణానికి చింతిస్తూ పాఠశాలలో బి.యస్. రావు చిత్రపటానికి పూలమాలవేసి మౌనం పాటించారు. ఈ సందర్భం గా ప్రిన్సిపల్ ఆకేపాటి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ బి. యస్. రావు మొట్టమొదటిసారిగా 1986లో శ్రీ చైతన్య విద్యాసంస్థలను స్థాపించి ఎందరో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దారని తెలిపారు. శ్రీ చైతన్య విద్యాసంస్థల నుంచి వేలాది మంది విద్యార్థులు ఉన్నతాధికారులు గాను, వైద్య, పారిశ్రామిక రంగాలలోనూ ఉన్నత స్థానాలను అధిరోహిం చారని., ఈ ఘనత బి.యస్. రావుకే దక్కుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ అనూష, డీన్ వెంకటసుబ్బయ్య, ప్రైమరీ ఇన్చార్జి కస్తూరి, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పచ్చి గ్రాసం ద్వారా అధిక పాల దిగుబడి

విశాలాంధ్ర-రాజంపేట : పశువులకు సంవత్సరం పొడవునా పచ్చి మేత వేయడం వలన అధిక పాల దిగుబడి సాధించవచ్చునని రాజంపేట డివిజన్ పశువైద్య ఉప సంచాలకులు డాక్టర్ కే.ప్రతాప్ రైతులకు సూచించారు. శుక్రవారం పశుగ్రాస వారోత్సవాల ముగింపు సందర్భంగా ఆకేపాడు పంచాయతీ లోని పెద్దూరు గ్రామంలో పశు విజ్ఞాన బడి కార్యక్రమాన్ని నిర్వహించా రు. ఈ సందర్భంగా డాక్టర్ కే.ప్రతాప్ మాట్లాడుతూ ఏ పి బి ఎన్, సి ఓ ఎల్, సూపర్ నేపియర్ నువ్వంటే పశుగ్రాసాలను సాగు బడి చేయాలని, తద్వారా ఎక్కువ దిగుబడి పొందవచ్చునని తెలిపారు. పచ్చి గడ్డి తో పాటు శుభాబుల్, అవిశ వంటి రకాలు పెంచడం ద్వారా పశువులలో పాల దిగుబడి పెంచవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో జే.వి.వో లు వరదయ్య, పూజా ప్రియాంక పాల్గొన్నారు.

అరాచక పాలనకు చరమగీతం పాడాలి

విశాలాంధ్ర-రాజంపేట: వైసిపి అరాచక పాలనకు చరమగీతం పాడాలని జనసేన రాజంపేట అసెంబ్లీ ఇన్చార్జి మలిశెట్టి వెంకటరమణ అన్నారు. వాలంటరీ వ్యవస్థను వినియోగించుకుని రాష్ట్రంలో వైసిపి చేస్తున్న అరాచకాలకు నిరసన తెలుపుతూ శుక్రవారం జనసేన నాయకు లు ఆర్డీఓ భాస్కర్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మలిశెట్టి వెంకటరమణ మాట్లాడుతూ కొంతమంది వాలంటీర్లు ప్రభుత్వానికి తొత్తులుగా పనిచేస్తున్నారని అన్నారు. ఎన్నికల లో అధికార పార్టీకి కొమ్ము కాస్తూ ఓటుకు నోటు పంచడం ప్రజలు చూశారని తెలిపారు. వాలంటీర్లు ప్రజలను సేకరించిన సమాచారాన్ని వైసిపి ప్రభుత్వం దుర్వినియోగం చేస్తూ అక్రమాలకు పాల్పడుతోందని తెలిపారు. ఇప్పటివరకు రాష్ట్రంలో అదృశ్యమైన 300 మంది మహిళలు ఏమయ్యారో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వైసీపీ పాలనలో దౌర్జన్యం, దుర్మార్గం, ఆక్రమణలు హెచ్చుమీరాయని.. ఇసుక అక్రమ రవాణా, మట్టి, మైనింగ్ మాఫియా విచ్చలవిడిగా సాగిస్తున్నారని ఆరోపించారు. వీటిపై ప్రశ్నించిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కు సమాధానం చెప్పలేక కొందరు వాలంటీర్ల ద్వారా ఆయన పై బురద జల్లుతున్నారని, పవన్ కళ్యాణ్ ను దూషించేందుకే క్యాబినెట్లో కొందరికి మంత్రి పదవులు కేటాయించారని అన్నారు. ఈ అరాచకం ఎంతో కాలం సాగదని, వైసీపీ కి తగిన గుణపాఠం చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు, వీరామహిళలు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో చీరలు, పంచెలు, టవళ్లు పంపిణీ

విశాలాంధ్ర-రామాపురం : లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో చిత్తూరు వాస్తవ్యులు రిటైర్డ్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎంప్లాయ్ సుబ్రమణ్యం ఆర్థిక సౌజన్యంతో బండపల్లి దగ్గర ఉండే ప్రేమాలయం వృద్ధాశ్రమం లో ఉండే వృద్ధులకు పంచెలు, టవల్లు,చీరలను ఆశ్రమం మేనేజర్ దేవనాథ రెడ్డి కి అందజేయడం జరిగిందని వ్యవస్థాపక అధ్యక్షులు లయన్ పి ఎస్ హరినాథ్ రెడ్డి తెలిపారు.అనంతరం దాత సుబ్రమణ్యం మాట్లాడుతూ నా వంతుగా ప్రజలకు ఉపయోగపడే సేవ చేయాలనే సంకల్పంతోనే ఈ రోజు బండపల్లి దగ్గర ఉండే ప్రేమాలయం వృద్ధాశ్రమం లో ఉండే వృద్ధులకు చీరలు,పంచెలు, టవల్లు పంపిణీ చేయడం జరిగిందని, అలాగే రాబోయే రోజులలో ప్రజలకు ఉపయోగపడే మరిన్ని సేవా కార్యక్రమాలు చేయడానికి నా వంతు సహాయ సహకారాలు అందజేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో కార్యదర్శి లయన్ షేక్ ఇందాద్ అహమ్మద్,కోశాధికారి లయన్ వి హరీష్ చంద్ర,లయన్ వి నారాయణ రెడ్డి ఆశ్రమం మేనేజర్ దేవనాథ రెడ్డి సభ్యులు పాల్గొన్నారు.

మిషన్ రాయలసీమ డిక్లరేషన్ కరపత్రాలు విడుదల

విశాలాంధ్ర -రాజంపేట: రాజంపేట పార్లమెంట్ తెలుగు యువత అధ్యక్షులు టీ. నవీన్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో యువ గళం పాదయాత్రలో భాగంగా టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, యువ నాయకుడు నారా లోకేష్ బాబు విడుదల చేసిన మిషన్ రాయలసీమ డిక్లరేషన్ పాంప్లెట్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా మీడియాతో నవీన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ లోకేష్ బాబు విడుదల చేసిన మిషన్ రాయలసీమ డిక్లరేషన్ ను ఈనెల 17 తేదీ నుంచి రాజంపేట పార్లమెంటు పరిధిలోని అన్ని నియోజక వర్గంలో విస్తృతంగా ప్రజల్లోకి విస్తృతంగా తీసుకు వెళ్లడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు పాల్గొన్నారు.